## సమ్మోనం భారతీయ-ఆస్ట్రేలియన్ సంగీతనృత్య సంగమం

**రవీంద్రభారతి, డిసెంబరు 26 ప్రభాతవార్త :** వారధి ఇండియా ఫౌండేషన్, చైతన్య ఆర్ట్ థియేటర్స్ సంయుక్త ఆధ్వర్యంలో వైష్ణవి నాట్యకేంద్రం సహకారంతో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో ఓషియన్‌విండ్స్ శీర్షికన నిర్వహించిన భారత్, ఆస్ట్రేలియా రెండు దేశాల సామరస్యపూర్వక సాంస్కృతిక సమ్మేళనం భారతీయ శాస్త్రీయ నృత్యం భరతనాట్యం, ఆస్ట్రేలియన్ జాజ్ కర్ణాటక సంగీత సంగమం విచ్చేసిన అశేష సంగీత, నృత్య కళాప్రియులు, ఔత్సాహిక ప్రేక్షకులను సమ్మోహనపరిచి మంత్రముగ్ధులను చేశాయి, సంగీతకారులు బి.వి.బాలసాయి కీఫ్లూట్స్; యు.పి.రాజు మాండొలిన్; అడ్రియన్ షరీఫ్ షకుహాచి, పెర్కషన్; టోనిహిక్స్ సాక్సోఫోన్, క్లారియోనెట్, ఫ్లూట్స్; డా. సురేష్ వైద్యనాథన్ ఘట్టాలు, పెర్కషన్స్; చంద్రకాంతం మృదంగం; డా. శ్రీకాంత్ తబలా, డా. వైష్ణవి సాయినాథ్‌ప్రభ్తు నట్టువాంగంలో అద్భుత వాద్యవిన్యాసం కావించగా డా. రాజేశ్వరి సాయినాథ్, మీనాక్షి మురళి, కీర్తిశ్రీ, డా. నిషికా మాదిరెడ్డి తదితరులు అద్భుత నృత్యప్రదర్శనతో సభికులను మంత్రముగ్ధులను చేసి కళాప్రపంచంలో ఓలలాడించారు. వారధి ఇండియా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డా. మోహన్‌కందా సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పూర్వ ప్రధాన కార్యదర్శి ఎల్.వి.సుబ్రహ్మణ్యం ముఖ్యఅతిథిగా పాల్గొని విశిష్ట అతిథులు సి.వి. ఆనంద్, డా. కె.ఐ.వరప్రసాదరెడ్డి తదితరులతో కలిసి ఆనాటి కార్యక్రమంలో పాల్గొన్న సంగీత నృత్యకళాకారులను ఘనంగా సత్కరించి ఎంతగానో అభినందించారు. కార్యక్రమాన్ని చైతన్య ఆర్ట్ థియేటర్స్ కె.కె.రాజా పర్యవేక్షించారు.



ఓషియన్‌విండ్స్ సంగీత నృత్యప్రదర్శనల్లో ఒక దృశ్యం





# హైదరాబాద్ వార్త


# అతిపెద్ద మున్సిపాలిటీగా 'జిహెచ్ఎంసి'

### -2,053 చదరపు కిలోమీటర్లు విస్తీర్ణం -12జోన్లు..60 సర్కిళ్లు..300వార్డులు - 1.34 కోట్లు దాటిన జనాభా

**హైదరాబాద్, డిసెంబరు 26,ప్రభాతవార్త:**

ఇంతింతై.. వటుడింతై అన్నట్లు జీహెచ్ఎంసీ తన పరిధిని పెంచుకొని.. దేశంలోనే అతి పెద్ద నగరంగా విస్తరించింది. దీంతో హైదరాబాద్ స్వరూపం మారిపోయింది. ఏకంగా 12 జోన్లు, 60 సర్కిళ్లు..300 వార్డులతో చిన్నపాటి రాష్ట్రంలా మారిపోయింది. ఇప్పుడు జీహెచ్ఎంసీ విస్తీర్ణం 650 చదరపు కిలోమీటర్ల నుంచి దాదాపు 2,050 చదరపు కిలోమీటర్లకు పెరిగింది. జనాభా 1.34 కోట్లు దాటింది. ఇది భారతదేశంలో అతిపెద్ద మున్సిపల్ కార్పొరేషన్‌గా మారింది. సింగపూర్ కంటే మూడింతలు, మారిషస్ స్థాయి విస్తీర్ణం కలిగిన నగరంగా హైదరాబాద్ రూపొందింది. ఈ విస్తరణతో జిహెచ్ఎంసిజోన్ల సంఖ్య 6 నుంచి 12కి, సర్కిళ్లు 30 నుంచి 60కి, వార్డులు 150 నుంచి 300కి పెరిగాయి. ప్రతి జోన్‌లో 5 సర్కిళ్లు, ప్రతి సర్కిల్‌లో 5 వార్డులు ఉంటాయి. ఈ మార్పులు పరిపాలనను వికేంద్రీకరించి, సేవలను మెరుగుపరచడానికి ఉద్దేశించినవి ఔటర్ రింగ్ రోడ్ పరిధిలోని అసమాన అభివృద్ధిని సరిచేయడమే దీని లక్ష్యం. విలీనమైన 27 సంస్థల్లో బడంగ్‌పేట్, బండ్లగూడ జాగీర్, మీర్‌పేట్,జిల్లెల్‌గూడ, బోడుప్పల్, పీర్‌జాదిగూడ, జవహర్‌నగర్, నిజాంపేట్ వంటి 7 కార్పొరేషన్లు, పెద్ద అంబర్‌పేట్, జల్‌పల్లి, శంషాబాద్, తుర్కయంజల్, మణికొండ, నార్సింగి వంటి 20 మున్సిపాలిటీలు ఉన్నాయి. ఈ విలీనం వల్ల రోడ్లు, మంచినీరు, పారిశుధ్యం, ఇళ్ల నిర్మాణం వంటి సేవలు ఒకే విధంగా అందరికీ అందుతాయి. కాగా వార్డు డీలిమిటేషన్ ప్రక్రియలో 6000కు పైగా అభ్యంతరాలు వచ్చాయి. సహేతుకమైనవి పరిగణనలోకి తీసుకొని తుది నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ మార్పులతో హైదరాబాద్ ప్రపంచ స్థాయి నగరంగా మారనుంది. రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులు పెరిగే అవకాశం ఉంది. ఏకరూప పన్నులు, మెరుగైన మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి. అయితే కొందరు విమర్శకులు ఇది కేంద్రీకృత నియంత్రణకు దారితీస్తుందనీ, స్థానిక సంస్థల స్వయం ప్రతిపత్తి తగ్గుతుందని అభిప్రాయపడుతున్నారు. అలాగే విస్తరణ తర్వాత జీహెచ్ఎంసీలో ఉద్యోగుల సంఖ్య కూడా పెరిగింది. విలీన సంస్థల నుంచి వందల మంది రెగ్యులర్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు చేరారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో 300 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. ఇది హైదరాబాద్ పరిపాలనను మరింత సమర్థవంతం చేస్తుంది. ఈవిస్తరణ వల్ల హైదరాబాద్ భవిష్యత్తు నగరంగా మారనుంది. ఫ్యూచర్ సిటీ కూడా దీనికి త్వరలో జత కలిసే ఛాన్స్ ఉంటుంది. ఈ మార్పులు తెలంగాణ రాజధాని హైదరాబాద్‌ను ప్రపంచ మ్యాప్‌లో మరింత ప్రముఖంగా నిలబెడతాయి.




పరిపాలనా సౌలభ్యం, ఆర్థిక వనరుల సమీకరణ మెరుగవుతాయి. కాగా సాధారణంగా తన పరిధిలోని ఉన్న సమస్యలనే పట్టించుకోలేని.. జీహెచ్ఎంసీ ఇప్పుడు.. పెరిగిన మహానగరంలోని కొత్త సమస్యలతో ఎలా వేగుతుంది.. ఎలాంటి పరిష్కారాలు చూపుతుంది అనేది సర్వత్రా ఆసక్తిగా మారింది.

**అతిపెద్ద నగరంగా హైదరాబాద్..**

శివారు మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల విలీనంతో భాగ్యనగరం (హైదరాబాద్) దేశంలోని మెట్రో నగరాల్లో అతిపెద్ద నగరంగా అవతరించనుంది. ఐదు జిల్లాలు, 47 మండలాలు, 311 గ్రామాల పరిధిలో ఆరు పార్లమెంటు స్థానాలు, 28 అసెంబ్లీ స్థానాలతో దేశంలోనే అతి పెద్ద నగరంగా హైదరాబాద్ విస్తరించబోతోంది. దేశ రాజధాని న్యూఢిల్లీ, ఆర్థిక రాజధాని ముంబై, ఐటీ క్యాపిటల్ బెంగళూరుతోపాటు చెన్నై, కోల్‌కతా తదితర మెట్రో నగరాల కంటే అగ్రభాగంలో నిలవనుంది. దేశంలోని మిగిలిన నగరాలతో పోల్చితే హైదరాబాద్ నగరం నలుదిక్కులా శరవేగంతో విస్తరించింది. ఇతర మెట్రో నగరాలతో పోల్చితే జీవన వ్యయం తక్కువగా ఉండటం, భాషా సమస్య లేకపోవడంతో విద్య, ఉద్యోగావకాశాలు, వ్యాపారం కోసం రెండు తెలుగు రాష్ట్రాల నుంచేకాకుండా దేశవ్యాప్తంగా చాలా రాష్ట్రాల వారు హైదరాబాద్‌ను తమ నివాస ప్రాంతంగా ఎంపిక చేసుకుంటున్నారు. ఇప్పటికే నగరం ఔటర్ రింగు రోడ్డు దాటిపోయింది.ఫార్మా రంగానికి కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న హైదరాబాద్.. ఐటీలోనూ బెంగళూరును మించి దూసుకుపోనుంది. బయోటెక్నాలజీ, ఇతర వ్యాపార, వాణిజ్య రంగాల పరంగా వేగంగా వృద్ధి చెందుతోంది. నగరంలో ప్రజల నుంచి వసూలు చేస్తున్న పన్నులు, వారికి కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, అందిస్తున్న పరిపాలన పూర్తిగా ఒకేవిధంగా ఉండాలనే సంకల్పంతోనే ఈ మహా విలీనం ప్రక్రియ చేపట్టినట్లు ప్రభుత్వం చెబుతోంది.

**బాధ్యతలు స్వీకరించిన 12 మంది జోనల్ అధికారులు..**

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లో ప్రస్తుతం ఉన్న6 జోన్లను 12కు పెంచుతూ ప్రభుత్వం తుది నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే..ఈనేపథ్యంలో 12 జోన్లకు జోనల్ కమిషనర్ లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో శుక్రవారం సంబంధిత అధికారులు జోనల్ కమిషనర్ లుగా బాధ్యతలు చేపట్టారు. రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్‌గా- అనురాగ్ జయంతి, గోల్కొండ జోనల్ కమిషనర్‌గా -జి ముకుందరెడ్డి ,కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌గా-అపూర్వ చౌహాన్, శంషాబాద్ జోనల్ కమిషనర్‌గా- కె.చంద్రకళ, ఉప్పల్ జోనల్ కమిషనర్‌గా -రాధికా గుప్తా, సికింద్రాబాద్ జోనల్ కమిషనర్‌గా- రవి కిరణ్ , ఖైరతాబాద్ జోనల్ కమిషనర్‌గా- ప్రియాంక అల, మల్కాజ్‌గిరి జోనల్ కమిషనర్‌గా -సంచిత్ గంగ్వార్, శేరిలింగంపల్లిజోనల్ కమిషనర్‌గా -బోర్కడే హేమంత్ సహదేవ్‌రావు, కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్‌గా- సందీప్ కుమార్ ఝా, ఎల్‌బినగర్‌జోనల్ కమిషనర్‌గా- హేమంత్ కేశవ్ పాటిల్, చార్మినార్ జోనల్ కమిషనర్ గా -ఎస్ శ్రీనివాస్ రెడ్డి లు బాధ్యతలు చేపట్టారు. .నూతనంగా బాధ్యతలు చేపట్టిన జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్లను జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్ అభినందించారు.ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వి కర్ణన్ మాట్లాడారు.విలీనంతో నగర విస్తీర్ణం 650 చదరపు కిలో మీటర్ల నుండి 2053 చదరపు కిలో మీటర్ల కు విస్తరించిందన్నారు. విస్తీర్ణం పెరగడంతో పాలనా సౌలభ్యం కోసం ప్రభుత్వం జీహెచ్ఎంసీ వార్డులను 150 నుండి 300కు పెంచిందన్నారు.జీహెచ్ఎంసీలో కొత్త జోన్లుగా ఉప్పల్, కుత్బుల్లాపూర్, మల్కాజిగిరి, శంషాబాద్, గోల్కొండ, రాజేంద్రనగర్ లు ఏర్పాటు అయ్యాయని చెప్పారు.అదనంగా జోనల్, సర్కిల్ కార్యాలయాల ఏర్పాటుతో ప్రజలకు పౌర సేవలు వేగంగా , సులభంగా అందుతాయని చెప్పారు. అభివృద్ధి మరింతగా వేగంగా జరుగుతుందని చెప్పారు.

## ఏసిలో మంటలు

### ..చిన్నారి మృతి



**హైదరాబాద్, డిసెంబరు 26 ప్రభాతవార్త**

కాచిగూడలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. శుక్రవారం సాయంత్రం కాచిగూడ, సుందర్‌నగర్‌లోని ఓ ఇంట్లోని ఏసీలో షార్ట్ సర్క్యూట్ జరిగింది. దీంతో మంటలు భారీగా ఎగిసిపడ్డాయి. ఆ సమయంలో ఇంట్లో ఇద్దరు చిన్నారులు ఉండగా..ఒకరు ఊపిరాడక అక్కడికక్కడే మృతిచెందారు. మరొకరికి తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికుల సమాచారంతో విషయం తెలుసుకున్న పోలీసులు ఫైరింజన్ల సాయంతో వచ్చి మంటలు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కేసు నమోదు చేసుకున్నారు. షార్ట్ సర్క్యూట్‌కు సంబంధించిన కారణాలపై ఆరా తీస్తున్నారు.

## న్యూ ఇయర్ రోజు

### అర్థరాత్రి వరకూ ఎంఎంటిఎస్ స్పెషల్ ట్రైన్లు

**హైదరాబాద్, డిసెంబరు 26 ప్రభాతవార్త**

కొత్త సంవత్సరం సందర్భంగా 2026 జనవరి 1న తెల్లవారుజామున నగరంలో ఎంఎంటిఎస్ స్పెషల్ ట్రైన్లు నడపాలని సౌత్‌సెంట్రల్ రైల్వే నిర్ణయించింది. ఒక ఎంఎంటిఎస్ స్పెషల్ ట్రైన్ లింగంపల్లి నుంచి జనవరి 1న అర్థరాత్రి 1.15 గంటలకు బయలుదేరి 1.55 గంటలకు నాంపల్లి రైల్వేస్టేషన్ చేరుకుంటుంది. ఈ ట్రైన్ చందానగర్, హఫీజ్‌పేట్, హైటెక్ సిటీ, బోరబండ, భరత్‌నగర్, బేగంపేట, ఖైరతాబాద్, లక్డీకాపూల్ సహా పలు కీలక రైల్వేస్టేషన్లలో ఆగుతుంది. ఆదే రోజు 1.30 గంటలకు లింగంపల్లి నుంచి ఫలక్‌నుమా వరకూ మరో ప్రత్యేక ఎంఎంటిఎస్ ట్రైన్ కూడా నడుస్తుంది. న్యూఇయర్ కారణంగా రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉండటంతో ప్రజలను గమ్యస్థానాలకు చేర్చడానికి ఈ స్పెషల్ ట్రైన్స్‌ను నడపాలని రైల్వే నిర్ణయించింది. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా అర్థరాత్రి వేళల్లో ప్రయాణికుల రద్దీ పెరిగే అవకాశం ఉంది.

## ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

**జూబ్లీహిల్స్, డిసెంబర్ 26, ప్రభాతవార్త:**

ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యానికి ఒక నిండు ప్రాణం బలైంది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. సూరారం ప్రాంతానికి చెందిన ఎర్రా ఈశ్వర్‌రావు(42) జూబ్లీ హిల్స్‌లోని నాని టిఫన్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం పని నిమిత్తం వెంకటగిరి వైపు వెళ్తుండగా పిల్లర్ నంబరు 1581 వద్ద రాణిగంజ్ బస్ డిపోకు చెందిన ఎలక్ట్రిక్ బస్సు వేగంగా వచ్చి అతన్ని ఢీకొంది. దీంతో ఈశ్వర్‌రావు అక్కడిక్కడే మృతిచెందాడు. పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని సంఘటన జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. బస్సు నడుపుతున్న డ్రైవర్‌ను రాంబాబుగా గుర్తించారు. అతన్ని అదుపులోకి తీసుకొన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. శవపంచనామా నిమిత్తం మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు.

## నల్లకుంటలో దారుణం..!

### భార్యపై అనుమానంతో పెట్రోల్ పోసి నిప్పటించిన భర్త

### స్వల్ప గాయాలతో బయటపడిన కూతురు



**హైదరాబాద్, డిసెంబరు 26 ప్రభాతవార్త**

నగరంలో అత్యంత దారుణమైన ఘటన చోటుచేసుకుంది. కట్టుకున్న భార్యపై అనుమానం పెంచుకున్న ఓ భర్త, కన్న పిల్లల కళ్లెదుటే ఆమెపై పెట్రోల్ పోసి నిప్పంటించి సజీవ దహనం చేశాడు. అడ్డువచ్చిన కుమార్తెను కూడా నిప్పుల్లోకి తోసి అక్కడి నుంచి పరారయ్యాడు. నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో క్రిస్మస్‌కు ఒక రోజు ముందు, ఈ నెల 24న ఈ ఘటన జరిగింది.నల్లకుంట పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మారుతి ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా హుజుర్‌నగర్‌కు చెందిన వెంకటేశ్, త్రివేణి ప్రేమ వివాహం చేసుకున్నారు.అనంతరం, ఉద్యోగ రీత్యా వీరిద్దరూ హైదరాబాద్‌కువచ్చారు. నల్లకుంట వద్ద ఉన్న తిలక్‌నగర్ బస్తీలో రెంటుకు ఉంటున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు,వారిలో ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. వెంకటేశ్ సెంట్రింగ్ పనిచేస్తుండగా.. త్రివేణి ఒక హోటల్లో పనిచేస్తుంది. కొంతకాలంగా భార్య త్రివేణి ప్రవర్తనపై వెంకటేశ్ అనుమానం పెంచుకుని తరచూ గొడవ పడుతూ వేధించేవాడు.త్రివేణి హోటల్ నుంచి ఇంటికి ఏ కొంచెం ఆలస్యంగా ఇంటికి వచ్చినా ఆమెను అనుమానంతో వెంకటేశ్ వేధించేవాడు. భర్త వేధింపులు తాళలేక కొద్దిరోజుల క్రితం త్రివేణి పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో తాను మారతానని నమ్మబలికి త్రివేణిని వెంకటేశ్ హైదరాబాద్ తీసుకొచ్చాడు. తీరా హైదరాబాద్ వచ్చిన తర్వాత వెంకటేశ్ మళ్లీ మొదటికొచ్చాడు. ఇద్దరి మధ్య కలహాలు పెరగడంతో ఆగ్రహానికి లోనైన వెంకటేశ్.. త్రివేణిని హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు ఈ క్రమంలో మంగళవారం అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో భార్య త్రివేణి, కొడుకు ఇద్దరు ఒకే మంచంపై నిద్రపోతుండగా.. కూతురు కింద పడుకుని ఉంది. ఆ సమయంలో మంచంపై నిద్రపోతున్న భార్య త్రివేణిపై పెట్రోల్ పోసి నిప్పటించాడు. ఇంతలో వెంకటేశును కూతురు అడ్డుకునే ప్రయత్నం చేయగా.. ఆమెకు కూడా మంటల్లోకి తీసే ప్రయత్నం చేశాడు.దీంతో వారి అరుపులు విన్న చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకునేసరికే త్రివేణి తీవ్ర గాయాలతో మృతి చెందింది. స్వల్ప గాయాలతో బయటపడిన కుమార్తెను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు, ఫోన్ ఆఫ్‌చేసి పరారీలో ఉన్న నిందితుడు వెంకటేశ్ పోలీసులు గంటల వ్యవధిలోనే అరెస్ట్ చేయగలిగారు.

## ట్రాఫిక్‌తో ప్రజలు పరేషాన్...

### జాతీయ రహదారిపై మూడు గంటలు ట్రాఫిక్ జామ్

**కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 26, ప్రభాతవార్త**



రోడ్డుపై నిలిచిన ట్రాఫిక్

కూకట్‌పల్లి వై జంక్షన్ వద్ద ముంబాయి జాతీయ రహదారికి ఆనుకొని కొత్తగా ప్రారంభించిన లేక్ షోర్ మాల్ కారణంగా ప్రజలు తరచూ ట్రాఫిక్ బారిన పడుతున్నారు. గురువారం క్రిస్మస్ పండుగ సందర్భంగా బయట నుండి వచ్చే వ్యక్తులతో పాటు కూకట్‌పల్లి నుండి బయటకు వెళ్లే వాహనాల రద్దీ శుక్రవారం ఎక్కువ కావడంతో మధ్యాహ్నం మూడు గంటల పాటు ట్రాఫిక్ పూర్తిస్థాయిలో స్తంభించిపోయింది. ఇక్కడి మాల్‌కు వచ్చే వాహనాల రద్దీని నియంత్రించేందుకుగాను కూకట్‌పల్లి ట్రాఫిక్ పోలీసులు రోడ్డు మధ్యలో ట్రాఫిక్ పిల్లర్ ఏర్పాటు చేశారు. వినియోగదారులు మాల్‌కు వెళ్లే వాహనాలు వేరే మార్గంలో వెళ్లేలా ఏర్పాటు చేశారు. కానీ నైనా గార్డెన్ నుంచి రహదారిపైకి వచ్చే వాహనాలు, రహదారి పైనుంచి కూకట్‌పల్లి గ్రామంలోకి వెళ్లే వాహనాలు, జాతీయ రహదారిపై వెళ్లే వాహనాలు ఒకదానికొకటి ఎదురెదురుపడి నిలిచిపోయి దాదాపు మూడు కిలోమీటర్ల మేర భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఇంతే కాకుండా మాల్ నిర్వాహకులు పక్కనే ఉన్న సర్వీస్ రోడ్డు కూడా మూసేయడంతో ఎటు వెళ్లాలో అర్థం కాక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఇప్పటికైనా ట్రాఫిక్ విభాగం అధికారులు చొరవ తీసుకొని సర్వీస్ రోడ్డు తెరిచి వాహనాలను అనుమతించాలని ప్రయాణికులు కోరుతున్నారు. అలాగే వాహనాల రద్దీని దృష్టిలో పెట్టుకొని ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా లేక్ షోర్ మాల్ నిర్వాకులు ప్రత్యేక చర్యలు తీసుకునే విధంగా వారిపై అధికారులు ఒత్తిడి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

## పివిఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వే పై రాకెట్స్ కాల్చిన ఆకతాయిల అరెస్టు




**అత్తాపూర్ డిసెంబర్ 26,ప్రభాతవార్త :**

పివిఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వే ఉప్పర్ పల్లి వద్ద రన్నింగ్ కారులో నుండి రాకెట్ షాట్స్ పేల్చితూ కలకలం సృష్టించిన ఆకతాయిలను ఫిర్యాదు అందిన గంటల వ్యవదిలోనే రాజేంద్ర నగర్ ట్రాఫిక్ పోలీసులు అరెస్టు చేశారు.ఎస్‌హెచ్‌ఓ రాజు వివరాల ప్రకారం....ఆరాంఘర్ నుంచి అంబర్‌పేట్ వైపు వెళ్తున్న కారులో నుంచి అర్థరాత్రి సమయంలో నిందితులు బాణసంచా కాలుస్తూ ప్రమాదకరంగా ప్రయాణించారని అదేవిధంగా ఇతర ప్రయాణికులను భయాందోళనకు గురి చేసినట్లు తెలిపారు.డ్రైవర్ అబ్దుల్ రజాక్(20)తోపాటు అతని స్నేహితులు అబ్దుల్ సమీ (22),సయ్యద్ (23)లను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తూ డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# న్యూ ఇయర్ వేళ 'జీరో డ్రగ్స్' లక్ష్యం

### -నిబంధనలు ఉల్లంఘిస్తే పబ్‌లు, హోటళ్ల లైసెన్సులు రద్దు : సిపి సజ్జనార్ హెచ్చరిక

**హైదరాబాద్,డిసెంబరు 26 ప్రభాతవార్త :**

నూతన సంవత్సర వేడుకల వేళ నగరంలో డ్రగ్స్ కట్టడిపై హైదరాబాద్ నగర పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు.'జీరో డ్రగ్స్' విధానమే లక్ష్యంగా కఠిన చర్యలు చేపట్టాలని సిటీ పోలీసు కమిషనర్ వీసీ సజ్జనర్ అధికారులను ఆదేశించారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో శుక్రవారం ఆయన హెచ్ న్యూ, టాస్క్‌ఫోర్స్, స్పెషల్ బ్రాంచ్, వెస్ట్‌జోన్, సీసీఎస్ తదితర విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించి, ఆయా విభాగాలకు దిశానిర్దేశం చేశారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా డ్రగ్స్ వినియోగాన్ని ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. "శుక్రవారం నుంచే నగరంలోని పబ్‌లు, హోటళ్లు రెస్టారెంట్లు, ఈవెంట్లు జరిగే ప్రదేశాల్లో ప్రత్యేక నిఘా బృందాలను మోహరించాం. ప్రధాన వేదికలతో పాటు సర్వీస్ అపార్ట్‌మెంట్లు, హాస్టళ్లలో జరిగే ప్రైవేట్ పార్టీలపైనా మా నిఘా ఉంటుంది. గత రెండేళ్లలో డ్రగ్స్ కేసుల్లో నిందితులుగా ఉన్నవారి కదలికలను నిశితంగా గమనిస్తున్నాం. డ్రగ్స్ సరఫరా చేసేవారు, వాటికి అలవాటు పడిన వారి జాబితా సిద్ధం చేసి వారిపై నిరంతర నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించాం. నగరానికి కొత్తగా వచ్చేవారి వివరాలనూ ఆరా తీస్తున్నాం"అని సీపీ సజ్జనర్ అన్నారు. వేడుకల సమయపాలనపై సీపీ హెచ్చరిస్తూ.. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా పబ్స్, హోటళ్లు, రెస్టారెంట్లు కచ్చితంగా రాత్రి 1 గంటకే మూసివేయాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించే పబ్స్, హోటళ్లు, రెస్టారెంట్లు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాటి లైసెన్సులను రద్దు చేస్తామని తేల్చిచెప్పారు. జనసమర్థ ప్రాంతాలైన మైత్రీవనం, నెక్లెస్ రోడ్డు, ట్యాంక్‌బండ్, కేబీఆర్ పార్క్ సహా జనం రద్దీగా ఉండే ప్రాంతాల్లో పటిష్టమైన చెక్‌పోస్టులు, బ్యారికేడింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. సర్వీస్ అపార్ట్‌మెంట్లు, హాస్టళ్లలో జరిగే ప్రైవేట్ వేడుకలపై కూడా నిఘా ఉంచాలని అధికారులకు చెప్పారు. నిఘా పేరుతో సామాన్య ప్రజలకు ఎలాంటి ఆటంకం కలగకుండా, వేడుకలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని అధికారులకు సూచించినట్లు పేర్కొన్నారు. పోలీసులందరూ సమన్వయంతో పనిచేసి నగర పోలీసు ప్రతిష్టను పెంచాలని చెప్పారు.

ఈ సమావేశంలో డీసీపీలు ఎన్.శ్వేత, కె.అపూర్వరావు, రక్షిత కృష్ణమూర్తి,సిహెచ్. రూపేష్,చింతమనేని శ్రీనివాస్, గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీలు అందే శ్రీనివాసరావు, ఇక్బాల్ సిద్దిఖీ, తదితర అధికారులు పాల్గొన్నారు.




తెలంగాణ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వివిధ పోలీసుల ఉన్నతాధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీపీ సజ్జనార్

## మారుతి వ్యాన్‌లో చెలరేగిన మంటలు

### -పెట్రోల్ బంకుకు తప్పిన పెనుప్రమాదం

**ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 26, ప్రభాతవార్త:** రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గల భారత్ పెట్రోల్ బంక్‌కి ఘోర ప్రమాదం తప్పింది. వరంగల్ హైదరాబాద్ జాతీయ రహదారిపై అన్నోజిగూడ వద్ద సర్వీస్ రోడ్డుపై వెళ్తున్న ఓమ్ని మారుతి వ్యాన్‌లో మంటలు చేలరేగాయి. వ్యాన్ నాగారం నుండి అన్నోజిగూడ వైపు సర్వీస్‌రోడ్డులో ప్రయాణిస్తుండగా ఆకస్మాత్తుగా మంటలు చేలరేగాయి. దీంతో వ్యాన్ డ్రైవర్ పెద్దపల్లి రాజు వ్యాన్ స్టీరింగ్ వదిలేసి కిందకు ప్రక్కకు దుకాడు. డ్రైవర్ కిందకు దూకిన తర్వాత జోరందుకున్న మంటలతో వ్యాన్ ముందుకు రోడ్డు ప్రక్కనే గల భారత్ పేట్రోల్ బంకులోకి వెళ్లింది. దీంతో అప్రమత్తమైన బంకు సిబ్బంది వ్యాన్‌పై నీళ్లుపోసి మంటలను ఆర్పివేశారు. బంకులోకి వెళ్లి ఆగిన మండుతున్నవ్యాన్ కారణంగా బంకుకు మంటలు అంటుకుంటే పెద్ద ప్రమాదమే జరిగేది. అన్నోజిగూడకు చెందిన పెద్దపల్లి రాజు ఎదో పని నిమిత్తం నాగారంకు వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగిందని తెలిపారు. మంటలకు దగ్గమైన మారుతి వ్యాన్ ( నెంబరు ఎపి 28 డిసి 0092 ) తెలిపారు. కాగా ఈ ప్రమాదంలో ప్రాణ నష్టం జరగలేదు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది, పోలీసులు సంఘటన స్థలికి చేరుకుని వ్యాన్‌కు అంటుకున్న మంటలను పూర్తిస్థాయిలో ఆర్పివేశారు. కాగా అప్పటికే వ్యాన్ దగ్ధం అయ్యింది. వ్యాన్‌లో అమర్చిన సిలెండర్ పేలడంతోనే మంటలు అంటుకున్నట్లు తెలిసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక సీఐ రాజు వర్మ తెలిపారు.



అన్నోజిగూడ వద్ద మారుతి వ్యాన్‌లో మంటలు చేలరేగి పేట్రోల్ బంకులోకి దూసుకుపోవడంతో మంటలు ఆర్పుతున్న బంకు సిబ్బంది.

## లాల్‌దర్వాజా మహంకాళికి డిసిపి కిరణ్ కరే పూజలు



దక్షిణ మండల డీసీపీ కిరణ్ ప్రభాకర్ కరేను సన్మానిస్తున్న మారుతీ యాదవ్

**చాంద్రాయణగుట్ట, డిసెంబర్ 26 ప్రభాతవార్త :** దక్షిణ మండల డిప్యూటీ పోలీసు కమిషనర్ కిరణ్ ప్రభాకర్ కరే శుక్రవారం చారిత్రక ప్రసిద్ధిగాంచిన లాల్‌దర్వాజా శ్రీ సింహవాహిణి మహంకాళి దేవాలయాన్ని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ బి.మారుతీ యాదవ్, కోశాధికారి ఎ.చంద్ర కుమార్‌లు డీసీపీకి ఘన స్వాగతం పలికారు. డీసీపీ కిరణ్ ప్రభాకర్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వాహించారు. అనంతరం ఆలయ చైర్మన్ మారుతీ యాదవ్ డీసీపీని శాలువతో సన్మానించి అమ్మవారి జ్ఞాపికను బహూకరించారు. ఆలయ చరిత్రను, అషాఢ మాసంలో అమ్మవారి బోనాల జాతర విశేషాలను డిసిపికి వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

**రతన్‌టాటా సేవారత్న పురస్కారానికి సాంబ లలిత ఎంపిక**

**చాంద్రాయణగుట్ట, డిసెంబర్ 26 ప్రభాతవార్త :** అలియాబాద్ శంషీర్‌గంజ్ శారదా విద్యాలయం డిగ్రీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ సాంబ లలిత రతన్‌టాటా సేవారత్న పురస్కార -2025కు ఎంపికైయ్యారు. ఈ మేరకు తెలంగాణ సిటీజన్ కౌన్సిల్ రాష్ట్రశాఖ అధ్యక్షులు రాజ్ నారాయణ ముదిరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 28వ తేదీ ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగే కార్యక్రమంలో పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. సాంబ లలిత గత 33 ఏళ్లుగా శారదా విద్యాలయం డిగ్రీ పీజీ కళాశాల అధ్యాపకురాలిగా, ప్రిన్సిపల్‌గా సేవలందిస్తున్నారు. బి.కాం, ఎం.కాం విద్యార్థులకు వాణిజ్య శాస్త్రం బోధిస్తున్నారు. వాణిజ్య శాస్త్రంలో 28 పాఠ్యపుస్తకాల రాశారు. ఆమె సేవలను గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ శతాబ్దికి ఉత్తమ క్లబ్ పురస్కార ప్రధానం



పురస్కారం అందుకుంటున్న పేరి నాగేశ్వర్ రావు

**చిక్కడపల్లి డిసెంబర్ 26 ప్రభాతవార్త :** సేవే లక్ష్యంగా, సమాజ శ్రేయస్సే ఆశయంగా నిరంతరం ముందుకు సాగుతున్న లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ శతాబ్ది మరోసారి తన సేవా సామర్థ్యాన్ని, నిర్వాహక నైపుణ్యాన్ని చాటుకుంది. శుక్రవారం క్లబ్ ప్రాంతీయ సమీక్షా సమావేశంలో 2025-26 సంవత్సరానికి క్లబ్ చేపట్టిన అనేక సేవా కార్యక్రమాలకు విశేషమైన ప్రశంసలు, గౌరవాలు, అవార్డులు అందుకుంది. సమాజంలోని పేదలు, నిరుపేదలు, విద్యార్థులు, వృద్ధులు, పర్యావరణ పరిరక్షణ, ఆకలితో బాధపడే వారి ఉపశమనం వంటి అనేక రంగాల్లో చేపట్టిన సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ శతాబ్ది బెస్ట్ క్లబ్ అవార్డు, ఎక్సలెంట్ హంగర్ రిలీఫ్ అవార్డు, బెస్ట్ పెర్మనెంట్ ప్రాజెక్ట్ అవార్డు, పేరి నాగేశ్వరరావు కు ఉత్తమ కార్యదర్శి అవార్డు , ఉత్తమ కోశాధికారి అవార్డు ను బి.కె.ఎం. రాజు, బెస్ట్ జోన్ చైర్‌పర్సన్ అవార్డు, ఉత్తమ అధ్యక్షుడు అవార్డు ను అనిల్ కుమార్ సొంతం చేసుకున్నారు. ఈ అవార్డులు కేవలం గుర్తింపుకే కాకుండా, క్లబ్ సభ్యులు చేసిన కృషికి, సమిష్టి సేవాభావానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. రీజియన్ స్థాయిలోనే కాకుండా జిల్లా, మల్టిపుల్ డిస్ట్రిక్ట్, అంతర్జాతీయ స్థాయిల్లో కూడా లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ శతాబ్దికి గుర్తింపు లభించడం నిజంగా ప్రశంసనీయమైన విషయం. డాక్టర్ సిఎం.ఏ. దుర్గాప్ర సాద్, కె.సి.హెచ్. ఏవీఎస్ మూర్తి , పేరి నాగేశ్వరరావు, జోన్ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి , పూర్వ అధ్యక్షులు విజయలక్ష్మి , కందాల శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

## 'శ్రీ మద్భగవద్గీత' సారాంశాన్ని అనుకరిస్తే భవిష్యత్తు బంగారుమయం



'శ్రీ మద్భగవద్గీత' శ్లోకాలు పారాయణం చేసిన వారికి జ్ఞాపికలను బహుకరించిన దృశ్యం

**చిక్కడపల్లి డిసెంబర్ 26 ప్రభాతవార్త :** వివేకానంద కేంద్ర కన్యాకుమారి, శ్రీ సరస్వతి శిశు మందిర్ ఆధ్వర్యంలో శుక్రవారం 50 మంది విద్యార్థులు "శ్రీ మద్భగవద్గీత" నుండి శ్లోకాలను పఠించారు. వివేకానంద కేంద్ర నిర్వాహకులు శ్రీనివాస రంగాచా ర్యులు, రామ లింగేశ్వర రావు మార్గదర్శనంతో , మంచి ప్రోత్సా హం అందడం , ప్రోత్సాహం విద్యార్థులను గట్టి ప్రేరణ ఇచ్చి నట్లయింది. కమిటీ సభ్యురాలు లిఖిత, స్కూల్ ప్రధానోపాధ్యా యురాలు శ్రవంతి నేతృత్వంలో , ఉపాధ్యాయులు స్నేహ, సరిత, దీపికా సమన్వయపరచారు. విద్యార్థులు ఉత్సాహంగా ఈ కా ర్యక్రమంలో పాల్గొనగా, ఈ కార్యక్రమాన్ని సమాచారపూర్ణ విజ యవంతం కావడానికి కృషి చేశారు. "శ్రీ మద్భగవద్గీత" సంస్కృతంకు సంబంధించి ప్రాముఖ్యతను వివరించారు "శ్రీ మద్భగవ ద్గీత" వల్ల ఆరోగ్యము మానసిక ఉల్లాసము పెరుగుతాయని చెప్పా రు. వివేకానంద కేంద్ర నిర్వాహకులు శ్రీనివాస రంగాచార్యులు మాట్లాడుతూ విద్యార్థులకు చిన్ననాటి నుండి మహాభారతం, రామాయణం, "శ్రీ మద్భగవద్గీత" గురించి తెలియజేయడం వల్ల జీవితం ఆనందమయంగా ఉంటుందన్నారు.

## పురానాపూల్,దేవిబాగ్‌లో క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న బ్రదర్ ఆనందం, నాగేష్

**చార్మినార్,డిసెంబరు 25 ప్రభాతవార్త :** చార్మినార్ నియోజకవర్గం ఎస్‌వినగర్‌లోని కానాన్ పెలోషిఫ్ వర్షిఫ్ మినిస్టర్సి చర్చిలో గురువారం రాత్రి క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో కానాన్ పెలోషిఫ్ వర్సిఫిఫ్ మినిస్టరి ప్రెసిడెంట్,ప్రధాన కార్యదర్శి బ్రదర్ బుర్రగల్ల ఆనందం,సిస్టర్ సంధ్య కేక్ కట్ చేసి క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రవీణ్, ఎలియా, సంపత్‌తో పాటు పలువురు పాల్గొన్నారు. దూద్‌బౌలి డివిజన్ పరిధిలోని దేవిబాగ్ బెతెల్ పెలోషిఫ్ మినిస్టర్సి చర్చిలో క్రిస్మస్ వేడుకలు అధ్యక్షులు టి.నాగేష్ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ కార్యక్రమంలో బెతెల్ పెలోషిఫ్ వర్సిషిఫ్ మినిస్టర్సి ప్రధాన కార్యదర్శి బి.సునీత విజయ్, కాలెబ్, కరుణ, ప్రవీణ, లలితమ్మ పాల్గొన్నారు.

## పంచాయతీరాజ్ చట్టాన్ని ప్రభుత్వం సవరించాలి



అభివాదం చేస్తున్న ఛాంబర్ నాయకులు

**సైఫాబాద్, డిసెంబరు 26 ప్రభాతవార్త:** రాష్ట్రంలో బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తరువాత సర్పంచుల వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిందని సర్పంచుల విధులు, నిధులు అడ్డుకుని అభివృద్ధి చేయలేదని తెలంగాణ పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు చింపుల సత్య నారాయణరెడ్డి ఆరోపించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గ్రామాలలో భూవిక్రయాలు, మైనింగ్ పనులలో కొంతమేర నిధులు గ్రామపంచాయతీలకు కేటాయించే వారని చెప్పారు. శుక్రవారం ఛాంబర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తరువాత పంచాయత్‌రాజ్ చట్టాన్ని సవరించి సర్పంచులకు ఇబ్బందులకు గురిచేసిందని ఆరోపించారు. సర్పంచ్‌లు అప్పులు చేసి అభివృద్ధి పనులు చేపట్టారని వారికి బిఆర్ఎస్ ప్రభుత్వం నిధులు ఇవ్వకుండా వేధించిందని, కొంత మంది ఆత్మహత్యలు కూడా చేసుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పుడు బిల్లుల కోసం ధర్నాలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ఉన్న మాదిరిగా స్టాంప్ డ్యూటీ, మైనింగ్ డ్యూటీ నిధులను గ్రామపంచాయతీల అభివృద్ధికి కేటాయించాలని కోరారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో 12,702 మంది సర్పంచులు ఎన్నికైనారని, వీరంతా రాబోయే ఐదేళ్ళలో ప్రజల సమస్యలు తీర్చి, గ్రామాలను అభివృద్ధి చేయాలని, మంచి పాలన అందించాలని ఆయన కోరారు. ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను సక్రమంగా వినియోగించుకోవాలని, ఎమ్మెల్యే స్థాయికి ఎదగాలన్నారు. పంచాయతీరాజ్ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం సవరించాలని, సిఎం రేవంత్‌రెడ్డి మేజర్ గ్రామపంచాయతీలకు 10 లక్షలు, చిన్న గ్రామ పంచాయతీలకు 5 లక్షల గ్రాంట్ ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ఛాంబర్ ప్రతినిధులు నరేందర్, అశోక్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నాం

## అన్నిరకాల సంగీతాలకు మాతృక శాస్త్రీయ సంగీతమే : పద్మభూషణ్ డా. వరప్రసాదర్‌రెడ్డి



సదస్సులో పాల్గొన్న వరప్రసాదరెడ్డి, శివారెడ్డి, చెన్నయ్య, రామాచారి, ఎంకె.రాము, పార్వతీశం, సుధామ, నాగలక్ష్మి, సురేఖమూర్తి, శశికళాస్వామి తదితర రచయితలు, గాయకులు

**నాంపల్లి, డిసెంబరు 26 ప్రభాతవార్త :** శాస్త్రీయ సంగీతం అందరికీ అబ్బేదికాదు.. ఆస్వాదించడమూ కష్టమే.. అందుకొక స్థాయి, స్థితి, జ్ఞానం, సాహిత్యంపట్ల అవగాహన ఉంటేనే సాధ్యమన్న శాంతా వసంతా ట్రస్టు అధినేత పద్మభూషణ్ డా. కె.ఐ.వరప్రసాదరెడ్డి అయినా అన్నిరకాల సంగీతానికి మాతృక శాస్త్రీయ సంగీతమేనని అన్నారు. కానీ సంగీతానికి శాస్త్ర ప్రమాణం అదేనని స్పష్టం చేశారు. అలనాటి, నేటి లలితగీతాల్లోని సంగీత సాహిత్యాల విశిష్టతను ఈతరానికి తెలియజేయడమే లక్ష్యంగా ఈ లలిత సంగీతం-సాహితీ సౌరభం అధ్యయన శిబిరాన్ని ఏర్పాటు చేయడం ప్రశంసనీయమని పరిషత్తుని కొనియాడారు. తెలంగాణ సారస్వత పరిషత్తులోని డా. దేవులపల్లి రామానుజరావు కళావేదికలో పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ అధ్యయన శిబిరంలో ముఖ్యఅతిథిగా వరప్రసాదరెడ్డి పాల్గొని మాట్లాడారు. ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షోపన్యాసంలో సంగీత సాహిత్యాల్లో సంగీతానిది ప్రథమస్థానమైతే సాహిత్యానిది అద్వితీయస్థానమన్నారు. లలితకళకు గొప్పశక్తి ఉందని, లలితసంగీతం లాలిత్యశబ్దం వల్ల పుటిందని చెప్పారు. సంగీతవిద్య పుట్టుకతోనే వచ్చేదని, దానికి సాహిత్యాన్ని జోడిస్తే గొప్పకళవుతుందని, అదే లలితసంగీతమని స్పష్టం చేశారు. కార్యక్రమానికి పరిషత్తు ప్రధాన కార్యదర్శి స్వాగతం పలుకగా, రింగు రామమూర్తి సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ అధ్యయన శిబిరంలో ఒక్కోకవి రచించిన గీతాన్ని గాయకులు ఆలపించగా కవి స్వయంగా పాల్గొని ఆ గీతంలోని సాహిత్య విలువలను, వినూత్న ప్రయోగాల గురించి విశ్లేషించారు. ఎందరో మహాకవులు రచించగా గాయనీగాయకులు ఆలపించగా దశాబ్దాలుగా డా. కొమాండూరి రామాచారి అనుసంధానకర్తగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రముఖ గీతకర్తలు డా. ఎం.కె.రాము, డా. ఓలేటి పార్వతీశం, సుధామ, రామకృష్ణారావు, డా, చిల్లర భవానీదేవి, వారణాసి నాగలక్ష్మి, మధుసూదన్, ప్రముఖ గాయకులు కెఎస్ఆర్.మూర్తి, ఎంఆర్‌కె.ప్రభాకర్, విజయలక్ష్మి, సురేఖామూర్తి, శశికళాస్వామి, ఇందిర, హేమవతి, అమృత, వినోద్‌బాబు, బాలాజీ, సంగీత దర్శకుడు డా. బంటి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని ఎంతగానో రక్తికట్టించారు.

## భారతీయ మిమిక్రీ పితామహుడు నేరెళ్ళ వేణుమాధవ్ : మధుసూదన చారి





కార్యక్రమంలో పాల్గొన్న శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదన చారి, కళా వి ఎస్ జనార్ధన మూర్తి, మిమిక్రి కళాకారుడు శివారెడ్డి తదితరులు

**చిక్కడపల్లి డిసెంబర్ 26 ( ప్రభాతవార్త ) :** మిమిక్రీ కళలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గొప్ప వ్యక్తి నేరెళ్ళ వేణుమాధవ్ అని తెలంగాణ శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదన చారి అన్నారు. శుక్రవారం చిక్కడపల్లి త్యాగరాయగానసభలోని కళా సుబ్బారావు కళా వేదికలో ధ్వన్యనుకరణ సామ్రాట్ డాక్టర్ నేరెళ్ల వేణు మాధవ్ యాదిలో సంస్మరణ సభ గాన సభ నిర్వహణలో తెలంగాణ బాషా సాంస్కృతిక శాఖ సహకారంతో అధ్యక్షుడు కళా వి ఎస్ జనార్ధన మూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన మధుసూదన చారి మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితిలో ప్రదర్శన ఇచ్చిన తొలి తెలుగు కళాకారుడు వేణు మాధవ్ అని అన్నారు. మిమిక్రీ కళకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన మహనీయుడని అని అన్నారు. భారతీయ మిమిక్రీ రంగానికి నేరెళ్ల వేణు మాధవ్ ఆద్యుడని, ఆయన సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితిలో ప్రదర్శన ఇచ్చిన మొదటి మిమిక్రీ కళాకారుడిగా ఆయన సాధించిన ఘనతను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రముఖ సినీ నటుడు శివా రెడ్డి, మిమిక్రి ఆర్టిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ జీవిఎన్ రాజు, ప్రముఖ సైకాలజిస్ట్ జివి సత్య నగేష్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత చొక్కాపు వెంకటరమణ, సినీ దర్శకులు, మిమిక్రి కళాకారుడు, కళారత్న మల్లం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యంను పరిహాసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం : బిఆర్ఎస్

### - ప్రజల అభ్యంతరాలను ఏకపక్షంగా తిరస్కరించడం సిగ్గుచేటు



డివిజన్ల సంఖ్యను పెంచాలన్న ప్రజల అభ్యంతరాలను ప్రభుత్వం పట్టించుకోలేదని నిరసన వ్యక్తం చేస్తున్న బిఆర్ఎస్ నేతలు.

**నార్సింగి, డిసెంబర్ 26 ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యంను పరిహాసం చేస్తుందని మణికొండ సర్కిల్ బిఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మణికొండలో బిఆర్ఎస్ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ మాట్లాడుతూ ఏకపక్షంగా చేసిన డివిజన్ల ఏర్పాటును ప్రజలు వ్యతిరేకిస్తూ 5935.అభ్యంతరాలు తెలిపితే 4891.అభ్యంతరాలను తిరస్కరించి ప్రజల ఇష్టాలను కాలరాశారన్నారు. కేవలం 1044అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని చేతులు దులుపుకున్నారని తెలిపారు. మణికొండ సర్కిల్‌లో నాలుగు డివిజన్లను ఏర్పాటు చేయిస్తామని ప్రగల్భాలు పలికిన స్థానిక కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు మొఖం చూపలేకపోతున్నారన్నారు. ఓటర్ల సంఖ్యను బట్టి మణికొండలో 4.డివిజన్లు ఏర్పాటు చేయాల్సి ఉండగా తీరని అన్యాయం చేశారని తెలిపారు. ప్రజల ఇష్టాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఇష్టానుసారంగా మున్సిపాలిటీలను, పంచాయతీలను గ్రేటర్‌లో విలీనం చేశారని, డివిజన్లు, జోన్లను సైతం ప్రజల అభిష్టాలకు విరుద్ధంగా చేశారని మండిపడ్డారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ, ప్రజాస్వామ్యంను ఖూనీ చేస్తూ, నిరకంకుశ పాలన చేస్తున్న కాంగ్రెస్‌కు వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు ఎదిరి చూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు నరేందర్, లక్ష్మణ్‌రావ్, విఠల్, మల్లేష్, దస్తగిరి, శ్రీధర్, సుమనళిని, నరేష్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## విశ్వేశ్వరయ్య సేవలు చిరస్మరణీయం



నివాళులు అర్పిస్తున్న హర్యాన పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ, జహీరాబాద్ లోకసభ సభ్యుడు సురేష్ కుమార్ షెట్కార్, వి.నాగభూషణం

**చిక్కడపల్లి డిసెంబర్ 26 ( ప్రభాతవార్త ) :** తెలంగాణ రాష్ట్ర జంగమ సమాజం అధ్యక్షుడు రుమాళ్ళ మఠం విశ్వేశ్వరయ్య చేసిన సేవలు చిరస్మరణీయమని హర్యాన మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. శుక్రవారం బాగ్ లింగంప ల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ రాష్ట్ర జంగమ సమా జం, తెలంగాణ రాష్ట్ర వీరసేవ అర్చక సమైక్య, తెలంగాణ రాష్ట్ర వీరసేవ ఆగమ పరిషత్, తెలంగాణ వీరసేవ జంగమ అర్చక పురోహి త సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర జంగ మ సమాజం అధ్యక్షులు రుమాళ్ళ మఠం విశ్వేశ్వరయ్య సంస్మరణ సభ సంఘం ఉపాధ్యక్షుడు విభూతి నాగభూషణం అధ్యక్షత వహించిన జరిగింది. ఈ కార్యక్రమంలో బండారు దత్తాత్రేయ తో పాటు జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్ హాజరై విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సభలో బిజెపి సీనియర్ నాయకురాలు డాక్టర్ విజయలక్ష్మి ,బసవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మల్లికార్జునప్ప, లింగ బలిజ సంఘం అధ్యక్షులు పటోళ్లసంగమేశ్వర్ ,గుంటిజగదీశ్వర్, ఆగమ పరిషత్ కార్యదర్శి పురాణ అవటం నాగయ్య స్వామి ,డాక్టర్ మహంతయ్య స్వామి, కోట గుండప్ప, బద్రిశ్వర్, ఈశ్వర్ ప్రసాద్, మల్లికార్జున శాస్త్రి, సతీష్, అర్చక సంఘం అధ్యక్షులు పురంతు వీరయ్య స్వామి, లింగాయత్ పరిషత్ అధ్యక్షుడు ప్రసారం శ్రీనివాస్, విశ్వేశ్వరయ్య భార్య జైశ్రీ, కుమారుడు ఆర్ రాజేశ్వర్ ,కూతుర్లు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## 30న జియాగూడలో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు



మాజీ మంత్రి తలసానికి ఆహ్వాన పత్రికను అందజేసిన నిర్వాహకులు

**జియాగూడ,డిసెంబర్ 26ప్రభాతవార్త:** ప్రతియేటా మాదిరిగానే ఈయేడు కూడా ఈనెల 30వ తేదినజియాగూడలోని చారిత్రా త్మకమైన రంగనాథ స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి ఉత్స వాలను అంగరంగ వైభ వంగా నిర్వహించేందుకుగాను ఏర్పాట్లు చేస్తు న్నారు. ఈమేరకు కార్పొరేటర్లు జి.శంకర్ యాదవ్, బి.దర్శన్, లాల్‌సింగ్‌లతో కలిసి ఆలయ నిర్వాహకులు ఎస్.టి చారి, ఎస్.బద్రీ మహారాజ్‌లు మర్యాదపూర్వకంగా మంత్రి శ్రీధర్ బాబు, మాజీ తలసాని శ్రీనివాస్‌యాదవ్‌లను కలిసి ఆహ్వాన పత్రికను అందచేశారు.

**గంజాయి సరఫరాదారునిపై పిడియాక్ట్ నమోదు**

**చాంద్రాయణగుట్ట, డిసెంబర్ 26 ప్రభాతవార్త :** చాంద్రాయణగుట్ట పోలీసుస్టేషన్ పరిధిలో గంజాయి సరఫరా చేస్తున్న ఒక వ్యక్తిపై పీడీ యాక్ట్ నమోదైయ్యింది. సదరు వ్యక్తిని పోలీసులు చంచల్‌గూడ కేంద్ర కారాగారానికి తరలించారు. ఇన్‌స్పెక్టర్ ఆర్.గోపి కథనం ప్రకారం... మెదక్, నారాయణఖేడ్‌కు చెందిన జాదవ్ శివరామ్(37) గంజాయి సరఫరా చేస్తుంటాడు. చాంద్రాయణగుట్ట పోలీసులకు చిక్కిన అతనిపై ఎన్‌డిపిఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. అతని నేర చరిత్రపై ఇటీవల నగర పోలీసు కమిషనర్ వి.సి.సజ్జనార్‌కు నివేదిక అందజేశారు. జాదవ్ శివరామ్ నేర చరిత్రను పరిశీ లించిన సీపీ పీడీయాక్ట్ నమోదుకు ఆదేశించారు. ఈ మేరకు పీడీయాక్ట్ నమోదు పత్రాన్ని జాదవ్ శివరామ్‌కు అందజేశారు. అనంతరం అతనిని చంచల్‌గూడ కేంద్ర కారాగారనికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

## క్రమశిక్షణ సంకల్పసిద్ధి కృషికి మారుపేరు ఉమాభట్టీశ్వరశర్మ : డా. ఎస్.శరత్‌జ్యోత్స్నారాణి



భట్టీశ్వరశర్మ దంపతులను ఘనంగా సత్కరిస్తున్న శరత్‌జ్యోత్స్నారాణి, ఎ.రాములు, గౌరీశంకర్, ఎం.కె.రాము, ప్రసాద్ తదితర అతిథులు

**నాంపల్లి, డిసెంబరు 26 ప్రభాతవార్త :** ఆచార్యరత్న, పద్య విద్యాధురీణ, ఆయుర్వేద సేవారత్న, సాహిత్య జ్ఞానభూషణ బిరుదాంకితులైన డా. పోతుకూచి ఉమాభట్టీశ్వరశర్మ సంకల్పసిద్ధికి కఠోరకృషి, క్రమశిక్షణకు మారుపేరుని, అందుకే ఆయన్ను అన్నిబిరుదులు వరించాయని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం తెలుగువిభాగం పూర్వ పీఠాధిపతి, పూర్వ శాఖాధ్యక్షురాలు డా. ఎస్.శరత్‌జ్యోత్స్నారాణి అన్నారు. ధర్మో రక్షిత రక్షితః! ధర్మాన్ని మనం రక్షిస్తే ఆ ధర్మమే మనని రక్షిస్తుందనడానికి నిలువెత్తు నిదర్శనంగా ఆయనను చెప్పుకోవచ్చని స్పష్టం చేశారు. భట్టీశ్వరశర్మ గొప్పపండితుడు, ఆసుకవి, ఆయన పాండిత్యాన్ని తప్పక గౌరవించాలన్నారు. అంతేగాక సామాజిక సేవకుడు, దైవభక్తుడు కూడా అన్నారు. గొప్ప ఉపన్యాసకులు, పద్యపఠనంలో దిష్ట ఎంతోమంది విద్యార్థులను ఉన్నతవిద్యావంతులుగా తీర్చిదిద్ది మరెంతోమందికి స్ఫూర్తిదాతగా నిలిచారు. ప్రతీరంగానికి మూలాలు ఉంటాయని, వాటిని ఎన్నటికీ మరువకూడదని, మూలాలు పటిష్టంగా ఉన్నప్పుడే ఆయారంగాలు, తరాలు పటిష్టంగా నిలబడతాయని వివరించారు. ఆయనకు సృజన భారతి ఘనంగా సత్కరించి గౌరవించుకోవడం శ్లాఘనీయమన్నారు. సృజన భారతి నిర్వహణలో బొగ్గులకుంట తెలంగాణ సారస్వత పరిషత్తులోని డా. దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో ఉస్మానియా విశ్వవిద్యాలయ సంస్కృతభాషా విభాగం పూర్వశాఖాధ్యక్షుడు డా. ఎ.రాములు సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శరత్‌జ్యోత్స్నారాణి విశిష్ట అతిథులు ఎం.కె.రాము, డా. టి.గౌరీశంకర్, డా. కొమ్మూరి ప్రసాద్ తదితరులతో కలిసి డా. పోతుకూచి ఉమాభట్టీశ్వరశర్మ దంపతులను ఘనంగా సత్కరించి తెలుగు సాహిత్య కళావాచస్పతి బిరుదుతోపాటు జీవన సాఫల్య పురస్కారంతో ఘనంగా సత్కరించారు. సభకుముందు సిద్ధేంద్ర కళాపీఠం, హైదరాబాద్ విద్యార్థులతో ప్రదర్శింపబడిన కూచిపూడి నృత్యం ఆహుతులను ఆహ్లాదపరిచింది.

## ఆరోగ్య కర సమాజం కళలతోనే సాధ్యం

### ..భారతీ యం సంస్థ స్థాపకులు సత్య వాణి



శ్రీప్రముని పీఠం నిర్వాహణలో డాక్టర్ ఏం ఉమా దేవి మెమోరియల్ నేషనల్ అవార్డ్ ను నాట్య గురువు నిష్ఠల సుధామాలను అందిస్తున్న భారతీ యం సంస్థ స్థాపకులు సత్య వాణి

**చిక్కడపల్లి డిసెంబర్ 26 ( ప్రభాతవార్త ) :** ఆరోగ్య కర సమాజం కళల ద్వారా సాధ్యము అని భారతీ యం సంస్థ స్థాపకులు సత్య వాణి చెప్పారు. నాట్య గురువు సుధా మాల ఎందరో శిష్యులు ను సంస్కార వంత కళా కారులుగా సమాజానికి అందిస్తున్నారు అని అభినందించారు. శుక్రవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై శ్రీప్రముని పీఠం నిర్వాహణలో డాక్టర్ ఏం ఉమా దేవి మెమోరియల్ నేషనల్ అవార్డ్ సుధా మాల కు ప్రధాన సభ జరిగింది ముఖ్య అతిథిగా సత్య వాణి మాట్లాడుతూ సంగీత నృత్య సాహిత్యాలు ఒత్తిడి తగ్గించి యువత ఆత్మ హత్యలు లేదా దురలవాటు ల జోలికి పోరు అన్నారు సుధా మాల సాంస్కృతిక రాయబారి అని ప్రశంసించారు అధ్యక్తత వహించిన ట్రజరీస్ డిప్యూటీ డైరెక్టర్ వసుంధర మాట్లాడుతూ సుధా మాల అంకిత భావంతో కల గొప్ప గురువు అన్నారు వారి తల్లి సోదరీమణులు కూడా నాట్య గురువులు అని చెప్పారు నవలా రచయిత డాక్టర్ ముదిగొండ శివ ప్రసాద్ సాధన నరసింహ చార్య ఆచార్య సుందర రామ కృష్ణ తదితరులు పాల్గొనగా సుష్మా ఇందు శేఖర్ కార్యక్రమ నిర్వహణ చేశారు.

## బస్తీ పిల్లలను చైతన్యం చేయటం అభినందనీయం

### ఇన్‌స్పెక్టర్ చందన ప్రసన్న



అప్సా ఆధ్వర్యంలో నిర్వహించిన బాల వాణి కార్యక్రమంలో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ చందన, ప్రసన్న

**ముషీరాబాద్, డిసెంబర్ 26, ప్రభాతవార్త:** బస్తీ పిల్లలను చైతన్యం చేస్తూ బాల వాణి కార్యక్రమం నిర్వహించటం అభినందనీయమని సెంట్రల్ జోన్ ఇన్‌స్పెక్టర్ చందన, దోమలగూడ ఇన్‌స్పెక్టర్ ప్రసన్న కొనియాడారు. శుక్రవారం ఇందిరా పార్కు లోని మర్రి చెన్నారెడ్డి రాక్ గార్డెన్‌లో అప్స స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో ఇందిరా ధనస్సు బాలల సంఘం మరియు వివిధ ప్రభుత్వ అధికారులతో పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలపై బాలవాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా హాజరై వారు మాట్లాడుతూ పిల్లలు ఎవరైనా ఆపదలో ఉంటే 100 కు డయల్ చేయాలని సూచించారు. రాత్రి వేళల్లో బస్తీలలో గస్తీ చేయిస్తామని, ఎవరికి ఎలాంటి ఆపద ఎదురైనా పోలీస్‌లను సంప్రదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ అసిస్టెంట్ ఇంజినీర్ సుప్రజ, బీజేపీ రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్, సర్వ్ నీడీ వ్యవస్థాపకులు డాక్టర్ గౌతం కుమార్ పాల్గొన్నారు.

## సర్కిల్ కార్యాలయంను నార్సింగిలోనే ఉంచాలి

### - బిఆర్ఎస్ నార్సింగి అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి

**నార్సింగి, డిసెంబర్ 26 ప్రభాతవార్త :** సర్కిల్ కార్యాలయంను నార్సింగిలోనే ఉంచాలని, మణికొండకు తరలిస్తే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని బిఆర్ఎస్ అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నార్సింగిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నార్సింగి సర్కిల్ కార్యాలయంను మణికొండకు తరలిస్తే ప్రజల సమస్యలు అధికారులకు తెలిపేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం నార్సింగిలో ఉన్న సర్కిల్ కార్యాలయం అందరికి అందుబాటులో ఉందని, దీన్ని ఇక్కడే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రజల సౌకర్యంను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ పెద్దలు నార్సింగి సర్కిల్ కార్యాలయంను మణికొండకు తరలించాలన్న నిర్ణయంను వెనక్కి తీసుకోవాలని విష్ణువర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు.

## కేంద్ర విధానాలను నిరసిస్తూ సిఐటియు నిరసన



ఎంబిఎన్ఆర్ చౌరస్తాలో నిరసన ప్రదర్శన నిర్వహిసున్న సీఐటియు నేతలు

**చాంద్రాయణగుట్ట, డిసెంబర్ 26 ప్రభాతవార్త :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీఐటీయు చాంద్రాయణగుట్ట జోన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఎంబిఎన్ఆర్ చౌరస్తా, జహంగీరాబాద్, రవీందర్ నాయక్ నగర్ కాలనీలో జరిగిన నిరసన ప్రదర్శనలలో జోన్ కన్వీనర్ ఎస్.కిషన్ మాట్లాడుతూ మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి దాని స్థానంలో వికసిత్ భారత్ గ్యారంటీ పర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిత్ మిషన్ పథకం ప్రవేశపెట్టి కార్మికుల, ప్రజల వేతనాలు పెరగకుండా కేంద్రం అడ్డుకునే చర్యలకు పాల్పడుతుందని విమర్శించారు. దీని వల్ల బహిరంగ మార్కెట్లో నిత్యవసర సరుకుల ధరలుకు అనుగుణంగా వేతనాలు పెంచే హామీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో కో కన్వీనర్లు కృష్ణ, రాంకుమార్, నాయకులు గౌస్, పాషా, అన్వర్, నాగరాజు, సుశీల్ తదితరులు పాల్గొన్నారు.

## కెపిహెచ్‌బిలో గుర్తుతెలియని వృద్ధుడి మృతి

**కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 26, ప్రభాతవార్త**

కెపిహెచ్‌బి కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన సంఘటన కెపిహెచ్‌బి కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కెపిహెచ్‌బి కాలనీలోని పిల్లర్ నెంబర్ 743 వద్ద వృద్ధుడు మృతి చెందినట్లు స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పెట్రోలింగ్ పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి వృద్ధుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. సుమారు 55 సంవత్సరాల పైబడిన వృద్ధుడు ఒంటిపై చొక్కా లేదని గత ఐదు రోజుల క్రితం నుండి ఇక్కడే సమీప ప్రాంతంలో భిక్షాటన చేసినట్లు స్థానికులు తెలియజేశారు. అనారోగ్యంతో పాటు తీవ్రమైన చలి కారణంగానే వృద్ధుడు మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**పేట్ బషీరాబాద్, డిసెంబర్ 26, ప్రభాతవార్త**

రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గురువారం రాత్రి 11 గంటలకు 30 నిమషాల సమయంలో మునీరాబాద్ విలేజ్, మేడ్చల్ కు చెంది నేనావత్ హరిచంద్ (38) తన బైక్ పై ఇంటి నుంచి తను పనిచేసే రిలయన్స్ రిటైల్ కంపెనీ దేవరయంజాల్‌కి వెళ్తుండగా మార్గమధ్యలో జంబో టైల్స్ కంపెనీ దగ్గర ఎటువంటి సేఫ్టీ మెజర్మెంట్స్ తీసుకోకుండా రోడ్డు పక్కన పార్క్ చేసిన లారీని వెనకనుంచి ఢీకొట్టగా తలకు బలమైన గాయమై ఘటన స్థలంలోనే మరణించాడు. ఈ మేరకు పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి విచార ణచేపడుతున్నారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**పేట్ బషీరాబాద్, డిసెంబర్ 26, ప్రభాతవార్త**

రోలర్‌లో చేతులు ఇరుక్కొని తీవ్ర గాయాలు కాగా, చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సైదపూర్, ఘాజిపూర్ జిల్లా, ఉత్తర ప్రదేశ్ కు చెందిన ఆకాష్ కుమార్ (22) బ్రతుకుతెరువు కోసం హైదరాబాద్‌కు వచ్చి రామి రెడ్డి నగర్, సుబాష్ నగర్‌లో ఉంటున్నాడు. గత 7 నెలల నుండి దూలపల్లి ఇండస్ట్రియల్ లోగల రూప ఇండస్ట్రీస్ కంపనీలో లేబర్ పని చేస్తున్నాడు. రోజు మాదిరిగానే 23.12.2025న ఉదయం 06:00 గంటలకు వెళ్లాడు. ఉదయం సమయం అందాజ 06:40 గంటలకు ఆకాష్ కుమార్ ఐరన్ రోల్ సరిచేస్తుండగా, అతని యొక్క చేతులు రోలర్‌లో ఇరుక్కొని రోలర్‌కు చుట్టుకొని పోతుండగా, వెంటనే గమనించి మిషన్ ఆపివేశారు. అతన్ని వెంటనే అంబులెన్సులో చికిత్స నిమిత్తం సికింద్రాబాద్ గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం 9:47 గంటలకు చనిపోయినట్లు డ్యూటి డాక్టర్ తెలిపారు. అయితే రూప ఇండస్ట్రీస్ యొక్క యాజమాన్యం అయిన రూపిష్ కుమార్ పారిక్ ఎటువంటి ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోక పోవడంతో ఆకాష్ కుమార్ మిషన్ రోలర్‌లో ఇరుక్కొని బలమైన గాయాలు అయి చనిపోయినట్లు పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఛత్రినాకలో ఘనంగా సిపిఐ 101వ ఆవిర్భావ దినోత్సవం



ఎంబిఎన్ఆర్ చౌరస్తాలో నిరసన ప్రదర్శన నిర్వహిసున్న సీఐటియు నేతలు

**చాంద్రాయణగుట్ట, డిసెంబర్ 26 ప్రభాతవార్త :** భారత కమ్యూనిస్టు పార్టీ 101వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. సీపీఐ గౌలిపురా డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఛత్రినాక ఆటోస్టాండ్ వద్ద జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ నగర కార్యవర్గ సభ్యులు జి.చంద్రమోహన్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గౌడ్ మాట్లాడుతూ సీపీఎం నిరంతరం ప్రజల పక్షాన నిలుస్తుందన్నారు. పార్టీ ఆవిర్భావం నుండి నేటి వరకు ఎన్నో పోరాటాలు చేసి కార్మిక, కర్షకులకు అనుకూల చట్టాలను చేసిన చరిత్ర ఉందన్నారు. మూడు వేల గ్రామాలకు విముక్తి కల్పించి, పది లక్షల ఎకరాల భూమిని నిరుపేదలకు పంచిన ఘనత సీపీఐదన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన విషయాన్ని గుర్తుచేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కులాల మధ్య చిచ్చు పెట్టి, దేశ సంపదను అంబానీ, అదానీలకు దోచి పెడుతుందని విమర్శించారు. కార్యక్ర మంలో జిల్లా సమితి సభ్యులు అటుకుల రాజు, కార్యవర్గ సభ్యులు సలీం, సునీల్, ప్రభాకర్, శ్యామ్‌లాల్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

## క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న సిఐ,ఎస్ఐ



**అత్తాపూర్ డిసెంబర్ 26,ప్రభాతవార్త :** క్రిస్మస్ సందర్భంగా ప్రేమావతి పేట్ గ్రామ బెతేస్తా ప్రార్ధన మందిరంలో నిర్వహించిన వేడుకల్లో రాజేంద్రనగర్ సిఐ ముత్తు యాదవ్ ,ఎస్ఐ ప్రశాంత్ రెడ్డి లు హాజరై క్రైస్తవ పెద్దలతో కలిసి కేక్ కటింగ్ చేశారు. ఈ సందర్భంగా క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ జై రామ్ సంఘం ప్రధాన కార్యదర్శి ఎడ్లకాడి సూర్యం , చర్చి పెద్దలు గోల్కొండ శంకరయ్య, తంగడిపల్లి భాస్కర్, సునిగంటి యాదయ్య, కవ్వగూడెం హరినాథ్, తంగడి పల్లి మోజెస్, బండ్లగూడెం బెంజమేన్, గోల్కొండ రాములు, సత్యనందం, లేవిరాజ్, ఉపేందర్, ఎడ్లకాడి చంద్ర శేకర్, బర్ల సుమన్, కవ్వగూడెం గౌతమ్, బండ్లగూడెం మోజెస్, పుష్పరాజ్, ఎడ్లకాడి అనిల్ కుమార్, రాకేష్, బెన్నీ , క్రాంతి ఉన్నారు

## గురుగోవింద్ సింగ్ కుమార్‌ల తాగ్యాలు మరువలేనివి : ఎంపీ ఈటల



సికింద్రాబాద్ గురుద్వార్ టెంపుల్‌లో ప్రార్థనలు చేస్తున్న ఎంపీ ఈటెల రాజేందర్,కార్పోరేటర్ కొంతం దీపిక, బిజెపి నాయకులు బానుక మల్లికార్జున్, బి.ఎన్.శ్రీను తదితరులు

**కంటోన్మెంట్,డిసెంబర్ 26 ప్రభాతవార్త:** ధర్మాన్ని రక్షించుకోవడం,ప్రాణాలను లెక్క చేయకుండా అంచలమైన ధైర్యాన్ని ప్రదర్శించిన గురు గోవింద్ సింగ్ కుమారులు సాహబ్జాదా జోరావర్ సింగ్, ఫతేసింగ్‌ల త్యాగాలు చిరస్థాయిగా నిలుస్తాయని మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ తెలిపారు. వీరబల్ దివస్‌ను పురస్కరించుకొని శుక్రవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలోని గురు ద్వారా అలయంలో సిఖ్ మత గురువు నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని వారి తాగ్యాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక, వీర్‌బల్ దివస్ కన్వీనర్ పూజరాజు, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బానుక మల్లికార్జున్, అధికార ప్రతినిధి బి.ఎన్.శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి బండారు విజయ లక్ష్మి, బిజెపి నాయకులు చిన్న వీరయ్య, జిత్తూ, జగన్‌మోహన్ సింగ్,టోపీ శంకర్,భరత్ సింహారెడ్డి,చంద్రశేఖర్ యాదవ్, మహిపాల్‌రెడ్డి, విజయానంద్,వీరవర్ధన్ గౌడ్,కొంతం నరేశ్ పాల్గొన్నారు.

### వైకుంఠ ఏకాదశి వేడుకలకు ఏర్పాట్లు : సిఓ సత్యమూర్తి



శివాజీ నగర్‌లో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న పెరుమాల్ దేవాలయం ఈఓ సత్యమూర్తి,వెంకట్‌రాజు తదితరులు

**అడ్డగుట్ట,డిసెంబర్ 26 ప్రభాతవార్త:** వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 30వ తేదీన సికింద్రాబాద్ శివాజీ నగర్‌లో ప్రసిద్ధిగాంచిన శ్రీ వెంకటేశ్వర పెరుమాల్ దేవాలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఆలయ ఈఓ కే.పి.సత్య మూర్తి,రెనోవేషన్ కమిటీ ఛైర్మన్ వెంకట్ రాజులు తెలిపారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల 30న జరిగే వైకుంఠ ఏకాదశి ఉత్తర ద్వార దర్శనం వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశామన్నారు. భక్తులకు ఎలాంటి అ సౌకర్యం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ప్రకాశ్ రావ్,నీలిమా, దర్గ రవి, శేఖర్ ముదిరాజ్,సుధాకర్, సారధి రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్ప స్వామి దేవస్థానం మండల పూజా మహోత్సవాలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న వడ్డేపల్లి దంపతులు

**కూకట్‌పల్లి, డిసెంబర్ 26, ప్రభాతవార్త :** వివేకానంద నగర్‌లోని శ్రీ అయ్యప్ప స్వామి దేవస్థానం 34వ వార్షిక మండల పూజా మహోత్సవాలు శుక్రవారం మంగళ వాయిద్యాల మహానాదంతో, వేదోచ్చారణల మధ్య ఆలయంలో అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు కార్యక్రమాలలో భాగంగా గోపూజ, భూతబలి, యాగశాల ప్రవేశం, విఘ్నేశ్వర పూజ, శైవశుద్ధి మహా పుణ్యాహవచనం, పంచగవ్య ఆరాధన, ప్రాశణ, దీక్ష కంకణ ధారణ, అఖండ దీపారాధన, అస్త్రరాజార్చన, సూర్య నమస్కారాలు, చతుర్వేద పారాయణం, నీరాజనాలు, మంత్రపుష్పాలతో నిర్వహించిన పూజలు ఆలయ ప్రాంగణాన్ని దివ్య ఆధ్యాత్మిక కాంతులతో నింపాయి. ఈ మహోత్సవాలను ఆలయ చైర్మన్ వడ్డేపల్లి రాజేశ్వరరావు, యామిని దంపతుల నేతృత్వంలో భక్తి, నియమం, సంప్రదాయ పరిరక్షణతో అతి ఘనంగా ప్రారంభించారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులతో కలిసి రాజేశ్వరరావు తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 30, 31 తేదీలలో జరిగే ఏనుగు అంబారీపై అయ్యప్ప స్వామి ఊరేగింపుతో పాటు 18 కళశాల మహా పడిపూజ మహోత్సవంలో భక్తులందరూ పెద్ద ఎత్తున పాల్గొని అయ్యప్ప స్వామి అనుగ్రహానికి పాత్రులు కావాలని ఆకాంక్షి ంచారు

## జేహెచ్‌పీఎస్ క్రాప్ వెల్ సీడ్స్



ఫీల్డ్ ట్రిప్‌లో పాల్గొన్న విద్యార్థులు

**జూబ్లీహిల్స్, డిసెంబర్ 26, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్(జేహెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో క్రాప్ వెల్ సీడ్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎనిమిదో తరగతి విద్యార్థులు మేడ్చల్ ప్రాంతానికి వెళ్లారు. వ్యవసాయం తీరుతెన్ను, పరాగసం పర్కం గురించి ఇక్కడ విద్యార్థులకు వివరించారు. పొలాలకు వెళ్లి అక్కడ మిరప పంటలు, మొక్కజొన్న పంటలను పండించే విధానాన్ని పరిశీలించారు. మొక్కల పెరుగుదుల దశలు, విత్తనాల నాణ్యత, నీటిపారుదల పద్ధతులు, తాజా ఆరోగ్యకరమైన పంటలను ఉత్పత్తి చేయడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నాణ్యమైన విత్తనాల ఎంపిక, పరీక్షలు, ప్రాసెస్ విధానం తదితర పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ పద్దతులు, జీవితంలో వాటి ప్రయోజనాలను విద్యార్థులు ప్రత్యక్షంగా తెలుసుకున్నారని పాఠశాల ప్రిన్సిపల్ తెలిపారు.

### ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే



మెరుగైన వైద్యానికి ఎల్.ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

**కంటోన్మెంట్,డిసెంబర్ 26 ప్రభాతవార్త:** పేద ప్రజల సంక్షేమం కోసం ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన లబ్దిదారులు సద్వినియోగం చేసుకొని ప్రయోజనం పొందాలని కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. వరంగల్ జఫర్‌గడ్ ప్రాంతానికి చెందిన కనక రమేష్ కుమారుడు భార్గవ్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. నిమ్స్ ఆసుపత్రిలో మెరు గైన వైద్యం కోసం మంజూరైన 2.50 లక్షల ఎల్ఓసీ పత్రాన్ని ఎమ్మెల్యే శ్రీగణేష్ చేతుల మీదుగా అందజేశారు.అనారోగ్యంతో బాధ పడుతున్న భాగర్గవ్ త్వరలో కోలుకొని ఆరోగ్యకరమైన జీవితం సాగించాలని అకాంక్షించారు.

## ప్రజా పోరాటయోధుడు వంగవీటి మోహన్ రంగా



రంగా విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న బండి రమేష్



వంగవీటి మోహన రంగ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న శంభీపూర్ క్రిష్ణ

**కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 26 ప్రభాతవార్త:** బడుగు బలహీనవర్గాల ప్రజలకు అవసరమైన సహాయం చేసేందుకు దివంగత నేత వంగవీటి రంగా ఎప్పుడూ ముందుండేవారని టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ కొనియాడారు. మోహన రంగా వర్ధంతి సందర్భంగా ఆయన అభిమానులు కెపిహెచ్‌బి కాలనీ బస్టాండ్‌లో ఉన్న రంగా విగ్రహం వద్ద నివాళి కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి బండి రమేష్ స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రంగా విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ లక్ష్మయ్య, కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి, తూము వినయ్ కుమార్, గొట్టుముక్కల వెంకటేశ్వరరావు, బి బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, కరుణాకర్ నాయుడు, గంధం రాజు, రాఘవేంద్ర, ఎల్ రాజా, తూము సంతోష్, ఫణి కుమార్, అక్బర్, భాస్కర్, అప్పారావు, భరత్, రంగమోహన్, పృధ్వి, రజిత, రేష్మ, సుజాత, రంగా అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**ప్రగతి నగర్‌లో**

**నిజాంపేట్, డిసెంబర్ 26, ప్రభాతవార్త :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ కార్పోరేషన్ పరిధి ప్రగతి నగర్‌లో శుక్రవారం వంగవీటి మోహన రంగా వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు శంభీపూర్ క్రిష్ణ పాల్గొని, రంగా విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గాజుల సుజాత, మాజీ కోఆప్షన్ సభ్యులు చంద్రగిరి సతీష్, కమిటీ సభ్యులు బోనం నాయుడు, లచ్చిబాబు, రాఘవేంద్ర ప్రసాద్, పవన్, ప్రసాద్, చిన్న రాంబాబు, వెంకట్రావు, రమణ, సత్యనారాయణ, చంటి, నరేంద్ర, కమిటీ సభ్యులు స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

**వంగవీటికి నివాళులర్పించిన నాగరాజు**

సమాజంలో అణగారిన వర్గాల హక్కుల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన పోరాట యోధుడు వంగవీటి మోహన్ రంగ అని బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకులు, కారుణ్య వెల్ఫేర్ సొసైటి వ్యవస్థాపకులు దాసి నాగరాజు తెలిపారు. శుక్రవారం వంగవీటి మోహన్ రంగా 37వ వర్ధంతి సందర్భంగా ప్రగతి నగర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాల సమర్పించి ఘనమైన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బిజెపి బిల్డర్ సెల్ జిల్లా కన్వీనర్ పద్మ ప్రసాద్, ముద్ర గాళ్ళ రాఘవేంద్ర ప్రసాద్, బోనం నాయుడు, పంతం పవన్, పోతుల రాంబాబు, పివి సత్యనారాయణ, శ్రీనివాస్, వెంకట్రావు, చంటి, సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

## కృషీవలుడు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

- రాజేంద్రనగర్, శంషాబాద్ కొత్త జోన్ల ఏర్పాటుపై హర్షం
- సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే



**అత్తాపూర్ డిసెంబర్ 26,ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశీస్సులు, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ నిరంతరం చేస్తున్న కృషి ఫలించింది. నియోజకవర్గ ప్రజల సౌకర్యార్థం మరియు పరిపాలనా వికేంద్రీకరణ లక్ష్యంగా ఆయన ప్రతిపాదించిన రాజేంద్రనగర్ మరియు శంషాబాద్ కొత్త జోన్ల ఏర్పాటు ప్రక్రియ విజయవంతంగా పూర్తయినట్లు ఆయన వెల్లడించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ.. "ప్రజల చెంతకు పాలనను చేర్చాలనే లక్ష్యంతో మేము చేసిన విన్నపాన్ని మన్నించి, రాజేంద్రనగర్ మరియు శంషాబాద్ ప్రాంతాలను ప్రత్యేక జోన్లుగా ప్రకటించిన ముఖ్యమంత్రికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. గత కొంతకాలంగా ఈ జోన్ల ఏర్పాటు కోసం ఎమ్మెల్యే ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరిపారు. పరిపాలనలో వేగం ఏర్పడుతుంది,కొత్త జోన్ల ఏర్పాటుతో పౌర సేవలు మరింత వేగంగా, పారదర్శకంగా ప్రజలకు అందుతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాజేంద్రనగర్,శంషాబాద్ ప్రాంతాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో, ఈ కొత్త జోన్లు మౌలిక సదుపాయాల మెరుగుదలకు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు.అనుకున్నది సాధించి, నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌ని ఈ సందర్భంగా స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు అభినందించారు.

### కానాను చర్చిలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న పాస్టర్ రవి,చర్చి పెద్దలు

**చార్మినార్,డిసెంబరు 26 ప్రభాతవార్త :** పాతబస్తీ కానాను చర్చిలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు జరిగాయి. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు.ఈ కార్యక్రమలో పాస్టర్ రవి,కానాను ప్రార్థన మందిరం అధ్యక్షుడు బుర్ర గల్ల కాలేబ్,పెద్దలు ఆనంద్,శామ్యుల్, నోయల్, డేవిడ్,జైపాల్,సాల్మాన్,పాస్టర్లు తిమోతీ, రాజ్‌కుమార్, సామ్యూల్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే శ్రీనివాస్ యాదవ్‌కు ఆహ్వానం



ఎమ్మెల్యే శ్రీనివాస్ యాదవ్‌కు వైకుంఠ ఏకాదశి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న శ్రీ బాలాజీ మందిరం కమిటీ ప్రతినిధులు

**చార్మినార్,డిసెంబరు 26 ప్రభాతవార్త :** చార్మినార్ సమీపంలోని శ్రీ బాలాజీ మందిరంలో ఈ నెల 30వ తేదీన జరగనున్న శ్రీ వైకుంఠ ఏకాదశి మహోత్సవాలలో పాల్గొనాలని కోరుతూ సికింద్రాబాద్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌యాదవ్‌కు మందిరం ప్రధాన అర్చకులు శృంగారం రమణా చార్యులు వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో వస్త్రాల వ్యాపారులు పియూస్ అగర్వాల్,రామ్‌జీ బన్సల్,అజయ్‌లు పాల్గొన్నారు.

### శివాజీనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుని ఏకగ్రీవ ఎన్నిక



శివాజీనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన విజయ్‌గౌడ్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న ఎన్నికల అధికారులు

**యూసుఫ్‌గూడ, డిసెంబర్ 26, ప్రభాతవార్త :** బస్తీ అభివృద్ధి కోసం తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ తాను చేసిన అభివృద్ధ పనులే తిరిగి ఏకగ్రీవంగా ఎన్నిక కావడానికి దోహదపడ్డాయని శివాజీనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎస్.విజయ్ గౌడ్ అన్నారు. అల్లాపూర్ డివిజన్ పరిధిలోని శివాజీనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుని పోటీలో ఈనెల 11వ తేదీన ఎన్నికల నామినేషన్ పర్వం ముగింపులో విజయ్‌గౌడ్ ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఎన్నిక అధికారి చంద్రశేఖర్, సహాయ అధికారి అభిలాష్ చారీలు విజయ్ గౌడ్‌ను అధ్యక్షునిగా ప్రకటిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విజయ్‌గౌడ్ మాట్లాడుతూ రెండోసారి కూడా తనపై నమ్మకంగా బస్తీవాసులు అధ్యక్షునిగా అవకాశం కల్పించటం అదృష్టంగా భావిస్తున్నానని తాను అన్నివేళల బస్తీ వాసులకు అందుబాటులో ఉంటూ అభివృద్ధికి పాటు పడతామన్నారు. ఈ కార్యక్రమంలో గిరధర్‌గౌడ్, సత్యనారాయణ, వెంకటేష్, శ్రీధర్ చారి, చందర్, బాలయ్య, యాదగిరి, మధుచారి తదితరులు పాల్గొన్నారు.

### అయ్యప్పస్వామి పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కాలేరు



ఎమ్మెల్యేను సత్కరించిన ప్రతినిధులు

**హైదరాబాద్, డిసెంబరు 26 ప్రభాతవార్త:** నల్లకుంట డివిజన్‌లోని న్యూ రామాలయం కమిటీ హాల్లో శుక్రవారం నిర్వహించిన శ్రీఅయ్యప ్ప స్వామి మహాపడి పూజా కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ పూజల్లో అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పాల్గొని పూజలు నిర్వహించారు. అయ్యప్పస్వామి నామస్మరణలతో రామాలయం మారుమ్రోగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేని కమిటీ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.

### ప్రభుత్వం పట్ల మరింత గౌరవం పెరిగేలా చూడాలి : బండి రమేష్



వేం నరేందర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న బండి రమేష్

**కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 26, ప్రభాతవార్త :** ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వానికి మంచి సలహాలు ఇచ్చి ప్రజల్లో ప్రభుత్వం పట్ల మరింత గౌరవం పెరిగేలా చూడాలని టిపిసిసి ఉపాధ్యక్షులు బండి రమేష్ పేర్కొన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధాన సలహాదారు వేం నరేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం ఆయన నివాసంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవతో కలిసి టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డికి పూలబొకే ఇచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీలో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. నిత్యం ఆయురారోగ్య అష్టైశ్వర్యాలతో విలసిల్లాలని, సీఎం రేవంత్ రెడ్డికి పాలనలో మంచి సలహాలు ఇచ్చి ప్రజల్లో ప్రభుత్వం పట్ల మరింత గౌరవం పెరిగేలా చూడాలని ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, ఉప్పల్ నియోజకవర్గం ఇంచార్జి పరమేశ్వర్ రెడ్డి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఇన్చార్జ్ కొలన్ హనుమంత్ రెడ్డి, సీనియర్ నాయకులు భూపాతి రెడ్డి, ఫ్లోర్ లీడర్ ద్వారపల్లి రాజశేఖర్ రెడ్డి, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా గ్రంధాలయం చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

**ఖేల్ మహోత్సవ కార్యక్రమం గోడపత్రిక ఆవిష్కరణ**

**చిక్కడపల్లి డిసెంబర్ 26 (ప్రభాతవార్త ) :** కేంద్ర భొగ్గు గనుల శాఖల మంత్రి జి.కిషన్ రెడ్డి నిర్వహించతలపెట్టిన ఖేల్ మహోత్సవ కార్యక్రమానికి సంబందించిన గోడ పత్రిక ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం అడిక్ మెట్ బీజేపీ డివిజన్ అధ్యక్షుడు పాశం సాయికృష్ణ యాదవ్ ఆవిష్కరించారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ప్రతి ఎంపీ తమ నియోజకవర్గంలో క్రీడా పోటీలను నిర్వహించాలని, తద్వారా గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలని ఇచ్చిన పిలుపులో భాగంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేపట్టినట్లు వివరించారు.

## ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలి

**నూతన సర్పంచులకు సొధాని భూమన్న యాదవ్ పిలుపు**



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న భూమన్నయాదవ్, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, పాండుగౌడ్ తదితరులు

**హైదరాబాద్, డిసెంబరు 26,ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఇటీవల జరిగిన పంచాయితీ ఎన్నికలలో విజయం సాధించి, పదవీ బాధ్యతలు చేపట్టిన సర్పంచులు తమ గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించేవిధంగా పనిచేస్తూ ముందుకు సాగాలని తెలంగాణ రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు సొధాని భూమన్న యాదవ్ తెలిపారు. ఈమేరకు శుక్రవారం సోమాజిగూడ లోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సర్పంచ్ ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా నిర్వహించిన ప్రభుత్వానికి ఎన్నికల సంఘానికి అభినందనలు తెలిపారు. అభ్యర్థులు, ఓటర్లు కూడా గ్రామస్థాయిలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. సర్పంచులుగా బాధ్యతలు చేపట్టిన ప్రతి ఒక్కరు కూడా గ్రామస్థాయిలో ప్రజాహితంగా పరిపాలన సాగించి మంచి నాయకత్వ లక్షణాలతో మరింతగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. గ్రామ పంచాయతీ లే గ్రామ ప్రభుత్వాలని 73, 74 రాజ్యాంగ సవరణల ప్రకారం 29 అంశాలున్నటువంటి మన అధికారాలు అన్నింటిని వినియోగించుకొని గ్రామాలను అభివృద్ధి పదంలో నడిపిస్తూ గ్రామ స్వరాజ్యాన్ని సాధించడమే ధ్యేయంగా సర్పంచులు పని చేయాలన్నారు. అనేక విమర్శలు ఒడిదుడుకులు మధ్య ఎట్టకేలకు పంచాయతీ ఎన్నికలను నిర్వహించిన సిఎం రేవంత్ రెడ్డి కి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకి భూమన్న యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్థాయిలో పంచాయతీ పాలనలో సర్పంచులు, పాలకవర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలు, గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2018 నూతన పంచాయితీరాజ్ చట్టంలో గల కొన్ని లోపాలు, జాయింట్ చెక్ పవర్ లాంటి అనేక సమస్యలను క్రోడీకరించి త్వరలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చి గ్రామ స్వరాజ్య స్థాపనలో, తెలంగాణ అభివృద్ధిలో పంచాయతీల ప్రాముఖ్యతను, పెంచవలసిందిగా కోరనున్నట్లు భూమన్న యాదవ్ తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర సర్పంచుల సంఘం పూకెళ్లి శ్రీకాంత్ రెడ్డి, లోపల్లి శ్రీనివాస రావు, ఉప్పులూరు ఆంజనీ ప్రసాద్, తాళ్ల పాండు గౌడ్, కొంగల ప్రజ్యోత కుమార్, రాజారెడ్డి, భాస్కర్ యాదవ్, సురేంద్ర ముదిరాజ్, భగవాన్ రెడ్డి, పెంటా గౌడ్, అవినాష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బాలల నృత్యాలు, సితార్ జంకార్, ఆవిష్కరణలతో అలరించిన బుక్‌ఫెయిర్

**తెలంగాణ గిరిజన క్షేత్రాలు-జాతర పుస్తకావిష్కరణ**



తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో సితార్ జంకార్

**ముషీరాబాద్, డిసెంబర్ 26, ప్రభాతవార్త:** లోయర్ ట్యాంక్ బండ్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో కొనసాగుతున్న హైదరాబాద్ బుక్‌ఫెయిర్‌లో కొంపల్లి వెంకట్‌గౌడ్ వేదికపై శుక్రవారం సాయంత్రం తెలంగాణ గిరిజన క్షేత్రాలు-జాతర పుస్తకావిష్కరణ ఘనంగా నిర్వహించారు. దక్కన్ ల్యాండ్ పత్రిక సంపాదకులు వేదకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ ఆవిష్కరణసభకు ప్రొఫెసర్ హరినాథ్ హాజరై మాట్లాడుతూ గిరిజన తెగల ఆదివాసీ సంస్కృతులపై పుస్తకాలు రావటం అభినందనీయమని కొనియాడారు. ప్రధాన అతిధిగా సేడం అర్జు మాట్లాడుతూ తెలంగాణ గిరిజన క్షేత్రాలు-జాతర పుస్తక రచయిత గిరిజన జాతులు, గోండులు, ఆదివాసీ తెగల జీవన విధానాన్ని, తెలంగాణ గిరిజన క్షేత్రాల సందర్శనల ద్వారా సమగ్రంగా అధ్యయనం చేసి, జాతరల విశిష్టతలను అద్భుతంగా వివరించారని ప్రశంసించారు. ధర్మ, అర్ధ, కామ, మోక్ష భావనలతో పాటు భూమి నరపాధాన్యత ప్రకృతి విశిష్టతలను ఈ పుస్తకంలో స్పష్టంగా వివరించారని తెలిపారు. గోండు గిరిజన తెగల దర్బారుల రూపాలు, వంశ పరంపరలు, నాగోబా మరియు దంతన్‌పల్లి భీమన్నకు సంబంధించిన అంశాలను సమగ్రంగా ప్రస్తావించిన తీరు ఎంతో విలువైనదిగా పేర్కొన్నారు. నిజాం కాలేజి అసిస్టెంటన ప్రొఫెసర్ ఆప్కా నాగేశ్వరరావు మాట్లాడుతూ నాగోబా జాతరను సమ్మక్క సారలమ్మ జాతరతో పోల్చి, గిరిజన జాతుల సంస్కృతి, సంప్రదాయం, జీవన విధానాన్ని ఈ జాతరలు స్పష్టంగా ప్రతిబింబిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పుస్తక రచయిత డాక్టర్ ధ్యావనపల్లి సత్యనారాయణ, తెలుగు విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్ బట్టు రమేస్, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి, శరత్బాబు, ప్రభాకర్, రాపోలు సుదర్శన్, జూగాష్ విలి, విజయ కుమార్, వినాయక్‌రెడ్డి, సుమిద, డాక్టర్ రాణి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**అలరించిన సితార్ జంకార్:** బుక్‌ఫెయిర్‌లోని అనిశెట్టి రజిత వేదికపై తెలంగాణ భాష సంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన త్యాగరాజా ప్రభుత్వ సంగీత కళాశాల బృందం సితార్ జంకార్ కార్యక్రమం సంగీత ప్రియులను విశేషంగా అలరించింది. తెలంగాణ సాహితి లిటరరీ ఫెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ: హైదరా బాద్ బుక్ ఫెయిర్‌లో తెలంగాణ సాహితి లిటరరీ ఫెస్ట్-2026 పోస్టర్‌ను ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ, ప్రకృతి కవిజయరాజ్‌లు ఆవిష్కరించారు. తెలంగాణ సాహితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.ఆనందాచారి మాట్లాడుతూ 2026 ఫిబ్రవరి 7,8 తేదీలలో దోమలగూడలోని ఏవీ కళాశాలలో తెలంగాణ సాహితి దశాబ్ది సాహిత్యోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి నామోజు బాలాచారి, బుక్‌ఫెయిర్ అధ్యక్షులు కవి యాకుబ్, కార్యదర్శి ఆర్.వాసు, కేంద్ర సాహిత్య అకాడమీ యువపురస్కార గ్రహీతలు మోర్సీ మర్గరేట్, తగుళ్ల గోపాల్, అనంతోజు మోహన్‌కృష్ణ, ఏబూషి నర్సింహ, శరత్ సుదర్శి తదితరులు పాల్గొన్నారు.

**బుక్‌ఫెయిర్‌ను సందర్శించిన తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి టంగుటూరి రాజేష్ ఖన్నా**

ఎన్టీఆర్ స్టేడియంలో కొనసాగుతున్న 38వ బుక్‌ఫెయిర్‌ను శుక్రవారం తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి, వరంగల్ గంగపుత్ర హౌసింగ్ సొసైటీ డైరెక్టర్ టంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చరవాణిని దూరం పెట్టి, పుస్తకంతో చెలిమి చేయటం ద్వారా విజ్ఞానాన్ని పొందటంతో పాటు మెదడు చురుకుగా ఉంటుదన్నారు. పుస్తకాల నుంచి కొత్త విషయాలు నేర్చుకోవటం ద్వారా మనలో ఆత్మ విశ్వాసం పెరుగుతుందన్నారు. తల్లి తండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలకు పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించేందుకు కృషి చేయాలని సూచించారు.

## అబిడ్స్ఐదవ అంతస్థులో గోల్కొండ జిహెచ్ఎంసి జోనల్ కార్యాలయం



గోల్కొండ జోనల్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ కమీషనర్ కర్ణన్,నూతన జోనల్ కమీషనర్ ముకుందరెడ్డి

**గోషామహల్,డిసెంబర్ 26ప్రభాతవార్త:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చారిత్రాత్మకమైన డీలిమిటేషన్ ఫైనల్ నోటిఫికేషన్ భాగంగా అబిడ్స్‌లోని జిహెచ్ఎంసి కార్యాలయంలోని ఐదవ అంతస్తులో నూతనంగా ఏర్పాటు చేసిన గొల్కొండ జిహెచ్ఎంసి జోనల్ కార్యాలయాన్నిగ్రేటర్‌హైదరాబాద్ మహానగర పాలక సంస్థ కమీషనర్ కర్ణన్‌తో కలిసి నూతన జోనల్ కమీషనర్‌ముకుంద రెడ్డి ప్రారంభించారు.ఈ కార్యాక్రమంలో డిప్యూటి మున్సిపల్ కమీషనర్ ఉమాప్రకాష్,జిహెచ్ఎంసి మెడికల్ అధికారులు,ఇంజనీర్ అధికా రులు తదితరులు పాల్గొన్నారు.అనంతరం గోల్కొండజోనల్ కమీషనర్ గా ముకుందరెడ్డి పదవి భాద్యతలు స్వీకరించారు.గోల్కొండ జోనల్ కార్యాలయంపరిధిలోని గోషామహల్ నియోజకవర్గం సర్కిల్ (30), 148 దత్తాత్రేయనగర్,149 మంగళ్‌హాట్ డివిజన్,150గోషామహల్ డివిజన్,151బేగంబజార్,152 జాంబాగ్ డివిజన్, 153 ఎగ్జిబిషన్‌గ్రౌండ్ డివిజన్,కార్వాన్ నియోజకవర్గం సర్కిల(31),143లంగర్‌హౌజ్,135 గుడిమల్కాపూర్,136 కార్వాన్,137టప్పాచబుత్రా,138జియాగూడ డివిజన్‌లు గోల్కొండ జిహెచ్ఎంసి జోనల్ కమీషనర్ పరిధిలోకి వస్తాయి.నిన్నటి వరకు గోషామహల్ 14 సర్కిల్ ఉన్న జిహెచ్ఎంసి విభజన పేరుతో గోషామహల్ సర్కిల్ 30గా మార్చడం మూలంగా ప్రజలు తీవ్ర అసంతృప్తిన్ని వ్యక్తం చేశారు.

## అణగారిన వర్గాల హక్కుల కోసం సిపిఐ



**అత్తాపూర్ డిసెంబర్ 26,ప్రభాతవార్త :** సిపిఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా రాజేంద్రనగర్ సిపిఐ మండల కార్యాలయం ఏఆర్ దేవరాజ్ భవన్ దగ్గర సిపిఐ రాజేంద్రనగర్ మండల కార్యదర్శి కన్యగారి నర్సింహ్మారెడ్డి అధ్యక్షతన జరిగినసిపిఐ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సిపిఐ రంగారెడ్డి జిల్లా మాజీ కార్యదర్శి పుస్తకాల నర్సింగ్ రావు హాజరై జెండా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా నర్సింగ్ రావు ,కన్యగారి నర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ .. సిపిఐ 100 సంవత్సరాలు సుదీర్ఘకాలం దేశంలో అనుగారిన వర్గాలకు హక్కుల కోసం దేశ స్వతంత్రం కోసం దేశ స్వతంత్రం పోరాటం లో అనేక త్యాగాలు చేసిన పార్టీ దేశ స్వతంత్రం కావాలని బ్రిటిష్ వారు ఈ దేశం నుంచి వెళ్లిపోవాలని నిర్భయంగా పిలుపునిచ్చిన పార్టీ ఎర్రజెండా అని కొనియాడారు. జనవరి 18న జరిగే ఖమ్మంలో శతాబ్ది ఉత్సవాల భారీ బహిరంగ సభ ముగింపు సభకు లక్షలాది మందితో జరుగుతున్న మహాసభకు పెద్ద ఎత్తున తరలివెళ్లి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు జే ఆనంద్ గౌడ్ రాజేంద్రనగర్ మండల కౌన్సిల్ సభ్యులు జె సదానంద గౌడ్ సయ్యద్ కాజా సాబీర్ హుస్సేన్ భాయ్ ఆఫీస్ కార్యదర్శి జి సత్యం మహిళా సమైక్య నాయకులు మునేశ్వరి మోనిక శాంతమ్మ పుష్ప భవాని పాల్గొన్నారు

### మనుస్మృతి వాల్‌పోస్టర్ల దగ్ధం

**సైఫాబాద్, డిసెంబరు 26 ప్రభాతవార్త:** మనుస్మృతి గ్రంథానికి వ్యతిరేకంగా అనేక మంది ట్యాంక్‌బండ్ వద్దగల డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం ఎదుట మనుస్మృతి వాల్ పోస్టర్‌లను దగ్ధం చేశారు. ఆల్ ఇండియా సమతా సైనిక్‌దళ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆనేక మంది ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమతా సైనిక్‌దళ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వెంకటస్వామి, పిఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ వి.సంధ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవిక, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కాదారం వినయ్‌కుమార్ మాట్లాడుతూ నాటి బ్రాహ్మణులు తమ కోసం రాసుకున్న మనుస్మృ తి గ్రంథంలో స్త్రీలను కించపరిచేవిధంగా ఉందని, చదువుకోరాదని, మంచి బట్టలు వేసుకోరాదని, భర్త చనిపోతే భార్య కూడా చితి మంటల్లో దహనం చేయడం వంటి దుర్మార్గమైన రాతలు ఉండటంతో 1927, డిసెంబరు 25వ తేదీన డా.బి.ఆర్.అంబేద్కర్ మనుస్మృతి గ్రంథాన్ని దగ్ధం చేయడం జరిగిందన్నారు. మనుస్మృతి దగ్ధమై 99 సంవత్సరాలు అయిన సందర్భాన్ని పురస్కరించుకుని వాల్‌పోస్టర్లను దగ్ధం చేయడం జరిగిందన్నారు. ఈ దుర్మార్గమైన మను స్మృతి గ్రంధాన్ని ఉపయోగించరాదని, అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని కేం ద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.


IN THE COURT OF THE HON'BLE IX ADDITIONAL CHIEF JUDGE, CITY CIVIL COURT AT : HYDERABAD
O.S.No. 586 OF 2025

Between:
1. Pavan Joshi
2. Ashwini Joshi ...Plaintiffs
AND
1. All Concerned ...Defendants

To,
All Concerned

NOTICE / SUMMONS

Please take notice that, the above plaintiffs have filed suit for Declaration of Legal Heirship against you. The case stands posted to **19.01.2026.** If any person or persons having any claims, objections, if any, whatsoever, they may appear either in person or through their advocate before the above Hon'ble Court on **19.01.2026 at 10.30 AM** otherwise the matter will be decided basing on the documents available on record. Hence this notice

By order of the Hon'ble Court
Sd/- ASHUTOSH B JOSHI
Advocate
#3-4-508/1, Street No.12, Barkatpura Housing Board Colony, Barkatpura, Hyderabad-500027.
Ph: 040-35844372, 9393930333

వార్త VAARTHA CLASSIFIEDS

LOST

★ Yeramareddy Brahmam Reddy S/o Y. Narayanareddy having LOST original DOC no 9265/2012 at SRO Balanagar Sy No 30 to 34 Plot No 26, 27at Miyapur Serilingampalli (md) have LOST the said DOCUMENT while traveling by mallampet to gandimaisamma if found pls cont 8008 364 389.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

## సెంట్రల్ ఎక్సైజ్ కాలనీలో సిసి రోడ్డు పనులు ప్రారంభం



సిసి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్వేత మధుకర్‌రెడ్డి

**సైదాబాద్, డిసెంబరు 26 ప్రభాతవార్త:** ఐఎస్ సదన్ డివిజన్ సెంట్రల్ ఎక్సైజ్ కాలనీలో రూ.23.38 లక్షల వ్యయంతో సిసి రోడ్డు నిర్మాణ పనులకు కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్వేత మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో నాణ్యతను పాటించాలని, రోడ్డు నిర్మాణ పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు జంగం మధుకర్‌రెడ్డి, కాలనీ కాలనీవాసులు సుబోధ్, రాజు, జగన్, విజయ్ కుమార్, ఎన్ఎస్ రెడ్డి, సిఎస్‌కె రెడ్డి, అలీ, మొహంత్, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## హిందువులపై దాడి చేయడం సమంజసం కాదు

**: కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి**



బంగ్లాదేశ్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి ృ, సందడి సురేందర్ రెడ్డి ,కొంగర ప్రవీణ్ తదితరులు

**మలక్ పేట, డిసెంబర్ 26, ప్రభాతవార్త:** హిందువులపై దాడి చేయడం సమంజసం కాదని ముసారంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి, బిజెపి భాగ్యనగర్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్ రెడ్డిలు పేర్కొన్నారు. బంగ్లాదేశ్ లో హిందువులపై జరిగిన దాడులు నిరసిస్తూ బిజెపి నాయకులు కొంగర ప్రవీణ్ ,రంజిత్, బాలుల ఆధ్వర్యంలో ముసారాంబాగ్ చౌరస్తా లో నిర్వహించిన కార్యక్రమంలో బిజెపి నాయకులు కార్యకర్తలు ప్ల కార్డులను ధరించి ఆందోళన నిర్వహించి బంగ్లాదేశ్ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందువులపై దాడులు జరగకుండా ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గౌర దేవేందర్, సురేందర్, శ్రీకాంత్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్కేపురం పల్లవి విల్లా నివాసితులకు న్యాయం జరిగేలా చూస్తాం

**- బిజెపి సీనియర్ నాయకులు ఉపేందర్ రెడ్డి**



**నేరెడ్‌మెట్, డిసెంబర్ 26,ప్రభాతవార్త :** ఆర్కేపురం పల్లవి విల్లా అపార్ట్‌మెంట్ నివాసితులకు ఎలాంటి అన్యాయం జరగకుండా న్యాయం జరిగేలా చూస్తామని నేరెడ్‌మెట్ డివిజన్ కార్పొరేటర్ మీనా ఉపేందర్ రెడ్డి భరోసా ఇచ్చారు. ఆర్కేపురం ఆర్‌ఓబీ నిర్మాణానికి అనుమతి రావడంతో, ఫ్లైఓవర్ బ్యూటిఫికేషన్‌లో భాగంగా అపార్ట్‌మెంట్‌లో కొంత భాగం కటింగ్‌కు వస్తుందని మునిసిపల్ అధికారులు నోటీసులు ఇవ్వడంతో నివాసితులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో అపార్ట్‌మెంట్ నివాసితుల అభ్యర్థన మేరకు వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు నాయకులు అపార్ట్‌మెంట్ సభ్యులను కలిశారు. పల్లవి విల్లా అపార్ట్‌మెంట్‌లో అధిక సంఖ్యలో సీనియర్ సిటిజన్లు, మాజీ సైనికులు నివసిస్తుండటంతో, వారు ఈ అంశంపై అధికారులకు ప్రతినిధిత్వం సమర్పించారు. ఈ విషయాన్ని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ దృష్టికి తీసుకెళ్లగా, అపార్ట్‌మెంట్ నివాసితులకు పూర్తిస్థాయిలో అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొత్తపల్లి ఉపేందర్ రెడ్డి, రమేష్ గౌడ్, డివిజన్ అధ్యక్షుడు ఆదిత్య, మల్లిక, రాజి రెడ్డి, పరాస్ జైన్, మహాపాత్రతో పాటు పలువురు కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

## మల్కాజిగిరి జోన్ కమిషనర్ కార్యాలయం ప్రారంభం

**-జోనల్ కమిషనర్‌గా పదవి బాధ్యతలు చేపట్టిన సంచిత్ గంగ్వార్**



**నేరెడ్ మెట్, డిసెంబర్ 26,ప్రభాతవార్త :** గ్రేటర్ హైదరాబాద్ డిలిమిటేషన్ ప్రక్రియలో భాగంగా మల్కాజిగిరి జోన్ కమిషనర్ కార్యాలయాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్‌గా సంచిత్ గంగ్వార్, ఐఏఎస్, అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. డిలిమిటేషన్ అనంతరం పరిపాలనను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ జోన్ కార్యాలయం కీలకంగా ఉపయోగపడనుందని అధికారులు తెలిపారు. జోన్ పరిధిలోని అభివృద్ధి పనులు, ప్రజా సమస్యల పరిష్కారంలో వేగం పెరుగుతుందని పేర్కొన్నారు.

## బంగ్లాదేశ్‌లో హిందువుల పై దాడులు అమానుషం



**తుర్కయంజాల్ డిసెంబర్ 26,ప్రభాతవార్త** బంగ్లాదేశ్‌లో హిందువు లపై రోజురోజుకు దాడులు పెరిగిపోతున్నాయని తుర్కయంజాల్ సర్కిల్లో యువకులు ఆవేదన వ్యక్తం చేశారు. గతవారం 18న బంగ్లాదేశ్ లో దీపు చంద్ర దాస్ అనే హిందూ యువకుడు నీ అతి దారుణంగా కొట్టి చంపిన సంఘటనను నిరసిస్తూ గురువారం నాడు తుర్కయంజాల్ సర్కిల్ యువకులు బంగ్లాదేశ్ కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలను కాపాడవలసిన బంగ్లాదేశ్ పోలీసులే ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని , బంగ్లాదేశ్ లో సుప్రీంకోర్టు, హైకోర్టు , పోలీస్ వ్యవస్థ ఇవన్నీ ఉన్నప్పటికీ అక్కడి హిందువులకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. శిక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బంగ్లాదేశ్ లోని హిందువుల రక్షణకు తగు చర్యలు తీసుకోవాలని వారి డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో అక్రమంగా ఎంతోమంది రోహిన్య ముస్లింలు ఉన్నారని వారందరినీ ప్రభుత్వం గుర్తించి తక్షణమే వారి దేశానికి పంపి వెయ్యాలని వారి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తుర్కయంజాల్ సర్కిల్ యువకులు తదితరులు పాల్గొన్నారు.

# హరిహర క్షేత్రంలో ఘనంగా కొనసాగుతున్న ధనుర్మాస ఉత్సవాలు

## - ఇఓ జోషి మార్తాండ రావు



హరి హరి క్షేత్రంలో స్వామి వారికి ప్రత్యేక పూజలను నిర్వహిస్తున్న అర్చకులు

**మలక్ పేట ,డిసెంబర్ 26 ప్రభాతవార్త :** మలక్ పేట పల్టన్ లోని శ్రీ హరిహర క్షేత్రంలో ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ధనుర్మాసాన్ని పురస్కరించుకుని దేవాలయంలో ప్రతి రోజూ పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగాదేవాలయం ఇఓ జోషి మార్తాండ రావు, చైర్మన్ సూగూరు రమేష్ లు మాట్లాడుతూ ధనుర్మాస ఉత్సవాలు జనవరి 13వ తేదీ మంగళవారం వరకు కొనసాగుతాయనితెలిపారు. ధనుర్మాసాన్ని పురస్కరించుకుని ప్రతిరోజు ఉదయం 6:30 నుంచి ఆరాధన అలంకారము, ధనుర్మాస అర్చనలు, నివేదన, ఉదయం 7 గంటలకు తిరుప్పావై ప్రబంధ సేవా కాలము, మంగళ శాసనము, పాసుర విన్నపము, తీర్థ ప్రసాద గోష్ఠి తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించనునట్లు వివరించారు. అదేవిధంగా డిసెంబర్ 30వ తేదీ మంగళవారం శ్రీ వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఉదయం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి అభిషేకము, వైకుంఠ ద్వార దర్శనము, జనవరి 11వ తేదీ ఉదయం ధర్మ కుడారై పాశురం, గోదాదేవికి నిరాటోత్స వం ,108 గంగాలాలతో అక్కల వడిశాల్ ప్రసాద నివేదన కార్యక్రమం, 14వ తేదీన శ్రీ గోదా కళ్యాణం తదితర పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవో జోషి మార్తాండ రావు, దేవాలయం అర్చకులు మంగళగిరి శ్రీనివాసచార్యులు, కాసుల చంద్రశేఖర శర్మ, దేవాలయం సభ్యులు శెట్టి విజయకుమార్, సరాపు శ్రీహరి, వనం సత్యేందర్, రోడ్డ రమేష్, రేణు అగర్వాల్, పారిజాతా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ ప్రజా సమస్యలపై నిరంతర ఉద్యమాలు



**తుర్కయంజాల్ డిసెంబర్26, ప్రభాతవార్త** భారత కమ్యూనిస్టు పార్టీ భారతదేశంలో ఏర్పడి 100 సంవత్సరాలు పూరైన సందర్భంగా తుర్కయంజాల్ సర్కిల్ పరిధిలోని రాజీవ్ గృహకల్పలో, తుర్కయంజాల్ చౌరస్తాలో సిపిఐ తుర్కయంజాల్ సమితి కార్యదర్శి అనంతుల కాటంరాజు గౌడ్ అధ్యక్షతన శుక్రవారం సిపిఐ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఒరుగంటి యాదయ్య మాట్లాడుతూ స్వాతంత్ర ఏర్పాటు కోసం, నైజాంలకు వ్యతిరేకంగా, రాజరిక వ్యవస్థలకు వ్యతిరేకంగా బ్రిటిష్ వలస పాలకులకు వ్యతిరేకంగా జాతీయ ఉద్యమంలో పాల్గొ న్న కమ్యూనిస్టులు జాతీయత భావాలతో అలుపెరుగని ఉద్యమాలు నిర్వహించిన గొప్ప చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీ ది అని అన్నారు. నాడు జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో వేలాది గ్రామాలను విముక్తి చేసి లక్ష ఎకరాల భూములు ప్రజలకు పంచిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీది అని తెలిపారు. భూమి కోసం బుక్తి కోసం భూ పోరాటాల విముక్తి పోరాటాలు ఎన్నో భారతదేశవ్యాప్తంగా సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగిందని అన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు కావాలని, ప్రభుత్వ స్థలాలలో గుడిసెలు వేయించి భూ పోరాటాలు ఎంతోమంది పేదలకు ఇళ్ల స్థలాలు పంచిన పార్టీ సిపిఐ అని ఆయన అన్నారు. ప్రజా పోరాటాలు ద్వారా పేదల సంక్షేమం కోసం ఉద్యమాలు చేసి తెచ్చిన కార్మిక చట్టాలను, ఉపాధి హామీ పథకాలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నాయని, మతం పేరుతో రాజకీయాలు చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని ఆయన అన్నారు. రాజ్యాంగాన్ని విస్మరిస్తూ పేదల హక్కులను హరించే పని పెట్టుకుని ఈ మోడీ ప్రభుత్వం పని చేస్తున్నారని అన్నారు. రానున్న రోజుల్లో ఈ కార్పొరేట్ శక్తులను గద్దె దింపి ఎర్రజెండా అధికారంలోకి వస్తుందని వారు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పీ శివకుమార్ గౌడ్, సిపిఐ నాయకులు అనురాధ, శ్రీకాంత్, శివ, నాగేశ్వర్, సుందరమ్మ, దుబ్బ యాదయ్య, శివప్రసాద్, పిల్లి సైదులు, వివేక్, భాస్కర్, నరసింహ, నీలా, కొట్య నాయక్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# బడంగ్‌పేట్ జోన్‌ను ఏర్పాటు చేయకపోవడం శోచనీయం

## రాష్ట్ర బిజెపి నేత కొలన్ శంకర్‌రెడ్డి



బడంగ్‌పేట్ జోన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్న కొలన్ శంకర్‌రెడ్డి

**సరూర్‌నగర్, డిసెంబర్ 26 ప్రభాతవార్త:** పునర్వ్యవస్థీకరిం చిన జిహెచ్ఎంసిలో కొత్తగా బడంగ్‌పేట్ జోన్‌ను ఏర్పాటు చేయకపోవడం శోచనీయమని తెలంగాణ రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యుడు, బాలాపూర్/బండ్లగూడ సింగిల్ విండో మాజీ ఛైర్మన్ కొలన్ శంకర్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలోని ముఖ్యమైన కార్పొరేషన్లలో ఒకటిగా ఉండి అనువైన స్థలంలో అన్ని సౌకర్యాలు ఉన్న చక్కని భవనం ఉన్న బడంగ్‌పేట్ కార్పొరేషన్‌ను జిహెచ్ఎంసిలో విలీనం చేసి జోన్‌గా ఏర్పాటు చేయకపోవడంపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇక్కడి డివిజన్ల ప్రజలకు అదే విధంగా పరిసర డివిజన్లకు ఏ మాత్రం దగ్గరలో లేని శంషాబాద్‌ను జోన్‌గా ఏర్పాటు చేయడం సమంజసంగా లేదని ఆయన అన్నారు. శుక్రవారం బాలాపూర్ చౌరస్తా సమీపంలోని ఎస్ఎల్ఎన్ఎస్ కాలనీలో మాజీ కార్పొరేటర్, బిజెపి నేత ఎడ్ల మల్లేష్ ముదిరాజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ప్రభుత్వ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల డీ లిమిటేషన్ చేసిన సందర్భంగా బడంగ్‌పేట్ కార్పొరేషన్‌ను చార్మినార్ జోన్‌లో విలీనం చేస్తే దీనిని బిజెపి వ్యతిరేకించిందని వెల్లడించారు. ఈ నేపథ్యంలో సాక్షాత్తు చేవెళ్ళ ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సైతం ఇక్కడ జరిగిన ఆందోళనకు హాజరై వ్యతిరేకించారని ఆయన గుర్తు చేశారు. దీంతో ప్రభుత్వం చార్మినార్ జోన్ నుండి తొలగించి కొత్తగా ఏర్పాటు చేసిన శంషాబాద్ జోన్‌లో కలపడం బిజెపి విజయంగా భావిస్తున్నామని ఆయన అన్నారు. అయితే నాదర్‌గుల్, ప్రశాంతిహిల్స్, జిల్లెలగూడ, మీర్‌పేట్, బడంగ్‌పేట్, బాలాపూర్ డివిజన్లు ఉన్న బడంగ్‌పేట్ సర్కిల్‌ను శంషాబాద్ జోన్ పరిధిలోకి తీసుకోవడం సమంజసంగా లేదని ఆయన పేర్కొన్నారు. దీనికి కాంగ్రెస్, బిఆర్ఎస్‌లే బాధ్యత వహించాలని ఆయన స్పష్టం చేశారు. జిహెచ్ఎంసిలో విలీనం అయిన బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్లు జల్‌పల్లి, తుక్కుగూడ, ఆదిభట్ల, తుర్కయాంజాల్ తదితర మున్సిపాలిటీలను కలిపి బడంగ్‌పేట్ పేరిట ప్రత్యేక జోన్‌ను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బడంగ్‌పేట్ జోన్ ఏర్పాటయ్యేందుకు మహేశ్వరం కాంగ్రెస్ ఇంఛార్జి కెఎల్‌ఆర్, స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిలు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఆయన అన్నారు. బడంగ్‌పేట్ జోన్ సాధన కోసం బిజెపి ఆధ్వర్యంలో ఉద్యమం ప్రారంభం అవుతుందని శంకర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్ ఎడ్ల మల్లేష్ ముదిరాజ్, రాఘవేందర్‌గౌడ్, శ్రీనివాసచారిలు పాల్గొన్నారు.

## కాల బైరవస్వామి ఆలయంలో సినీ నటి రాశి పూజలు



ఉప్పల్ కాల బైరవస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న సినీనటి రాశి తదితరులు

**ఉప్పల్, డిసెంబరు 26 ప్రభాతవార్త :** ఉప్పల్ భగాయత్‌లోని శ్రీ కాల బైరవస్వామి ఆలయంలో ప్రముఖ సినీ నటి రాశి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఆమె ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటి చైర్మన్ పూజల ప్రభాకర్, ఏమాండ్ల రాంరెడ్డి, రాజశేఖర్, తదితరులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ శ్రీ కాలబైరవ స్వామి ఆలయం గురించి మహిమ గురించి పలువురు చెప్పడంతో వచ్చి ఆలయంలో పూజలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయ కమిటి నేతలు ఆమెను సత్కరించారు. ఆలయ పూజారి కన్నయ్య పంతులు ప్రత్యేక పూజలు చేయించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆలయ కమిటి నేతలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డితో కాంగ్రెస్ నేతల బేటి



రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డితో బేటి అయిన కాంగ్రెస్ పార్టీ నేతలు ఎం.పరమేశ్వర్‌రెడ్డి, వజ్రేష్ యాదవ్ తదితరులు

**ఉప్పల్, డిసెంబరు 26 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్ రెడ్డితో శుక్రవారం మేడ్చల్ జిల్లాకు చెందిన పలువురు పార్టీ నేతలు బేటి అయ్యారు. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, ఉప్పల్ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్‌రెడ్డి,మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి నియోజకవర్గాల ఇంచార్జ్ కోలన్ హనుమంతురెడ్డి, బండి రమేష్, టిపిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి, జిహెచ్ఎంసి ఫ్లోర్ లీడర్ ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేం నరేందర్‌రెడ్డిని శాలువాతో సత్కరించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

## చైనా మాంజా విక్రయాలపై కఠిన చర్యలు

**-ఇన్‌స్పెక్టర్ సందీప్ కుమార్**



**నేరెడ్‌మెట్, డిసెంబర్ 26,ప్రభాతవార్త :** నేరెడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చైనా మాంజా విక్రయాలు, వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు చేపట్టినట్లు ఇన్స్పెక్టర్ సందీప్ కుమార్ తెలిపారు. చైనా మాంజా ప్రజల ప్రాణాలకు, పర్యావరణానికి తీవ్ర ప్రమాదం కలిగిస్తోందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోవినోబా నగర్‌కు చెందిన గౌలికల్ హరిలాల మోనిక సైడ్ షాప్ నిర్వహిస్తూ అక్రమంగా చైనా మాంజా విక్రయిస్తున్నట్టు గుర్తించి, అతని వద్ద నుంచి 11 చరకాల చైనా మాంజాను స్వాధీనం చేసుకుని, వ్యాపార నియంత్రణ, పర్యావరణ చట్టాల కింద కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. అదేవిధంగా మారుతి నగర్‌కు చెందిన ఓ మైనర్ బాలుడి వద్ద నుంచి నాలుగు చరకాల చైనా మాంజాను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. చైనా మాంజా అమ్మకం, వినియోగం చట్టవిరుద్ధమని, ఇటువంటి కార్యకలాపాలపై సమాచారం అందిస్తే తక్షణమే చర్యలు తీసుకుంటామని ఇన్స్పెక్టర్ సందీప్ కుమార్ స్పష్టం చేశారు. ప్రజలు సహకరించి ప్రమాదాలను నివారించాలని కోరారు.

## రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్‌గా అనురాగ్ జయంతి బాధ్యతలు

**అత్తాపూర్ డిసెంబరు26, ప్రభాతవార్త :** నూతనంగా ఏర్పడిన రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి కర్ణన్ ముఖ్యఅతిథిగా హాజరై కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం కమిషనర్ సమక్షంలో రాజేంద్ర నగర్ జోనల్ కమిషనర్‌గా అనురాగ్ జయంతి బాధ్యతలు స్వీకరించారు. వారికి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ...నూతనంగా ఏర్పాటైన రాజేంద్ర



నూతన జోనల్ కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి కర్ణన్

నగర్ జోన్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా సిపిఐ ఆవిర్భావ దినోత్సవ దినోత్సవ వేడుకలు



సిపిఐ జండా ఎగుర వేస్తున్న శంకర్ నాయక్

**సైదాబాద్, డిసెంబరు 26 ప్రభాతవార్త:** భారత కమ్యూనిస్టు పార్టీ 101వ ఆవిర్భావ దినోత్సవాన్ని సింగరేణి కాలనీలో ఘనంగా నిర్వహించారు. సింగరేణి కాలనీ రోడ్డు నెం.8, గిరిజన సమాఖ్య భవన్ వద్ద సిపిఐ జండాలను సీనియర్ నాయకులు శంకర్ నాయక్ ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఐ పేదల పక్షాన నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎస్ సదన్ డివిజన్ కార్యదర్శి షేక్ మహమూద్, నాయకులు వర్ధ్య, సక్రిభాయి, దశరథ్ నాయక్, యశోదరావు, రాజు, మహమూద్, అంజయ్య, సుదర్శన్, పాషా, అమీన, రేష్మ పాల్గొన్నారు.

## సుప్రజా ఆసుపత్రి హెల్త్ కార్డు ఆవిష్కరణ




హెల్త్‌కార్డు ఆవిష్కరిస్తున్న మహేష్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 26 ప్రభాతవార్త:** గౌడ అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ గోప 50 వసంతాల పూర్తి చేసుకున్న సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగోల్ సుప్రజ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో హెల్త్ కార్డులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుప్రజ ఆసుపత్రి ఎండి విజయ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఈ కార్డు ఉన్నవారికి ఉచితంగా కన్సల్టేషన్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి అధ్యక్షుడు మహేష్ గౌడ్, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, శాసనమండలి మాజీ ఛైర్మన్ స్వామి గౌడ్, తెలంగాణ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్, బీసీ కమిషన్ సభ్యుడు బాల లక్ష్మి, జస్టిస్ ఈశ్వరయ్య, మహిళా కమిషన్ ఛైర్మన్ నేరెళ్ల శారద గౌడ్, గోపా ప్రెసిడెంట్ బండి సాయన్న ఆస్పత్రి జిఎం అజయ్ కుమార్ గౌడ్, క్యాంప్ కోఆర్డినేటర్ కార్తీక్ తదితరులు పాల్గొని హెల్త్ కార్డును ఆవిష్కరించారు.

## చిలుకానగర్‌లో ఘనంగా అయ్యప్ప మహాపడిపూజ



చిలుకానగర్‌లో జరిగిన అయ్యప్ప మహాపడిపూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, డిసెంబరు 26 ప్రభాతవార్త :** అయ్యప్ప స్వామి ఆశీస్సులతో అందరూ సుఖ సంతోషాలతో వుండాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం చిలుకానగర్ శివాలయం కమిటి నేత దాసరి కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన అయ్యప్ప మహాపడిపూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత, బిఆర్ఎస్ పార్టీ నేతలు బూర్గుల రమేష్‌గౌడ్, పిట్టల నరేష్, పల్లె నర్సింగ్‌రావు, కొండల్‌రెడ్డి, మాస శేఖర్, ఆర్.బలరాం, బిజెపి సీనియర్ నేత దేవసాని బాలచందర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ అయ్యప్ప భక్తులకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. శివాలయం నిర్మాణం పూర్తి అయ్యేందుకు తగు చేయూత అందిస్తానని ఆయన పేర్కొన్నారు. ఆలయాన్ని సర్వంగా సుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ సందర్భంగా అయ్యప్ప గీతాలతో చిలుకానగర్ శివాలయం మారుమ్రోగింది. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్పస్వాములు అమృత రావు, సుబ్బారావు, వాసు, గణేష్,పలువురు పార్టీల నేతలు పాల్గొన్నారు.

## నిషేధిత చైనా మంజా అక్రమ నిల్వపై మల్కాజ్‌గిరి పోలీసుల కఠిన చర్యలు



**మల్కాజిగిరి డిసెంబరు26,ప్రభాతవార్త :** మల్కాజ్‌గిరి పోలీసులు విధుల్లో ఉన్న సమయంలో గౌతమ్ నగర్ ప్రాంతంలో నిషేధిత మోనో గోల్డ్ (చైనా) మంజాను అక్రమంగా నిల్వ చేసి, అధిక ధరలకు విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. సమాచారం మేరకు పోలీసులు వెంటనే తనిఖీలు నిర్వహించగా, అడ్డగుట్టకు చెందిన ఆర్. శివ కుమార్ (22 ) చిట్టలూరి కల్యాణ్ (23 ) మరో వ్యక్తి అక్రమంగా చైనా మంజాను కలిగి ఉన్నట్లు గుర్తించబడింది. ఈ మేరకు సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టారు. నిందితుల వద్ద అక్రమంగా కలిగి ఉన్న నిషేధిత చైనా మంజాను స్వాధీనం చేసుకున్నా. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం చైనా మంజా తయారీ, నిల్వ, రవాణా మరియు విక్రయం పూర్తిగా నిషేధించబడినవి. దీనిని కలిగి ఉండటం గానీ, విక్రయించడం గానీ చట్టపరంగా నేరం అని, ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని మల్కాజ్‌గిరి పోలీసులు హెచ్చరించారు.

## త్యాగాల పునాదులపై ఎదిగిన ఉద్యమం : సిపిఐ



జెండా ఆవిష్కరణలో నాయకులు

**హయత్ నగర్, డిసెంబర్ 26 ప్రభాతవార్త:** సీపీఐ ఒక రాజకీయ పార్టీగా మాత్రమే కాకుండా పేద ప్రజల పక్షాన నిలిచే మహోద్య మంగా ఎదిగిందని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, ఎల్బీనగర్ నియోజ కవర్గ కార్యదర్శి సామిడి శేఖర్ రెడ్డి అన్నారు. పార్టీ శతవార్షికోత్స వాన్ని పురస్కరించుకొని హయత్ నగర్ మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ... 1925లో కాన్పూర్ కేంద్రంగా ఆవిర్భవించిన సీపీఐ బ్రిటిష్ పాలనకు వ్యతిరే కంగా జరిగిన స్వాతంత్ర్య పోరాటంలో ముందు వరుసలో నిలిచిందన్నారు. తెలంగాణ గడ్డపై నిజాం నిరంకుశ పాలనకు, రజా కార్ల అరాచకాలకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంలో సీపీఐ కీలక పాత్ర పోషించిందనన్నారు. దున్నేవాడిదే భూమి అనే నినాదంతో భూ స్వామ్య వ్యవస్థను ఎదిరించి లక్షలాది ఎకరాల భూమిని పేదలకు పంచిన ఘనత ఎర్రజెండాకే దక్కుతుందని కొని యాడారు. కార్మిక, కర్షక, నిస్సహాయుల గొంతుకగా నిలబడి 8 గంటల పని దినాన్ని సాధించడం నుండి ఉపాధి హామీ చట్టం సాధన వరకు కమ్యూనిస్టుల కృషి దాగి ఉందన్నారు. రాజ్యాంగ పరిరక్షణ, ప్రజా స్వామ్య విలువల కోసం సీపీఐ తన పోరాటాన్ని ఉధృతం చేస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ హయత్‌నగర్ మండల కార్యదర్శి శ్రీదేవి, సహాయ కార్యదర్శులు మర్రి శోభన్, కర్నె సుజాత, నాయకులు సామిడి వంశి వర్ధన్ రెడ్డి, బొంగు అరుణ్ కుమార్ గౌడ్, గోల్కొండ నాగరాజు, మందుల కృష్ణ, సరిత, పాల్వాయి సురేందర్ పాల్గొన్నారు.

## ఎస్‌జిఎఫ్ఐ కరాటే పోటీల్లో సత్తా చాటిన జైశాంత్



సర్టిఫికెట్ అందుకుంటున్న గుర్రంగూడ దడిగ జైశాంత్

**సరూర్‌నగర్, డిసెంబర్ 26 ప్రభాతవార్త:** వరంగల్ జిల్లా బండారుపల్లిలోని ములుగు గిరిజన భవన్‌లో ప్రతిష్ఠాత్మకంగా జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జిఎఫ్ఐ) కరాటే పోటీల్లో బాలాపూర్ మండలం బడంగ్‌పేట్ సర్కిల్‌లోని గుర్రంగూడ గ్రామానికి చెందిన దడిగ జైశాంత్ సత్తాచాటి స్వర్ణ పతకం సాధించి మహారాష్ట్ర పూణేలో జరగనున్న జాతీయ స్థాయి ఛాంపియన్‌షిప్ పోటీలకు అర్హత సాధించాడు. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 6వ డివిజన్ గుర్రంగూడ మాజీ కార్పొరేటర్ దడిగ శంకర్ కురుమ కుమారుడైన జైశాంత్ అల్మాస్‌గూడ ఆర్యా ఇంటర్నేషల్ స్కూల్‌లతో చదువుకుంటూ కరాటే కోచ్ కొమురవెల్లి మిథిలేష్ శిక్షణలో రాటుదేలాడు. ఈ నేపథ్యంలో ఎస్‌జిఎఫ్ఐ పోటీల్లో పాల్గొని 40 కెజిల విభాగంలో ప్రత్యర్థులను మట్టి కరిపించి పతకం సాధించాడు. ఈ నేపథ్యంలో అక్కడ జరిగిన బహుమతుల ప్రదానోత్సవంలో ప్రముఖుల చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకున్నాడు. అదే విధంగా హస్తినాపురం కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌కు చెందిన విద్యార్థి సాయి మేఘన్‌రెడ్డి 58 కెజిల విభాగంలో ప్రతిభ కనబరచి సర్ణపతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడు.

## చందన చెరువు కట్టపై బ్రహ్మంగారికి ప్రత్యేక పూజలు, గీతా పారాయణం



పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహం వద్ద జరిగిన పూజా కార్యక్రమాలకు హాజరైన పులిగిల్ల శ్రీనివాసచారి, పసునూరి బిక్షపతిచారి తదితరులు

**సరూర్‌నగర్, డిసెంబర్ 26 ప్రభాతవార్త:** బాలాపూర్ మండలం బడంగ్‌పేట్ సర్కిల్‌లోని జిల్లెలగూడ చందన చెరువు కట్టపై కాలజ్ఞాని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహానికి శుక్రవారం ప్రత్యేక పూజలు, గీతా పారాయణ కార్యక్రమాలను నిర్వహించారు. చెరువు కట్టపై విగ్రహాన్ని ఆవిష్కరించి ఏడాది పూర్తి అయిన సందర్భంగా విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. పూజలు, పారాయణం అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా రంగారెడ్డి జిల్లా విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పులిగిల్ల శ్రీనివాసచారి హాజరైన ఈ కార్యక్రమాల్లో స్వర్ణకార సంఘం అధ్యక్షుడు వింజమూరి రాఘవాచారి, మీర్‌పేట్ మాజీ కార్పొరేటర్ పసునూరి బిక్షపతిచారి, విగ్రహ దాత సోమోజు నరేందర్‌చారి, ఆవిష్కరణ కమిటీ ఛైర్మన్ రాగిపని అశోక్‌చారి, వైస్ ఛైర్మన్ ఆందోజు దయానంద్‌చారి, రత్నమాచారి, కలకొండ శ్రీనివాసచారి, ప్రభాకరచారి, స్వర్ణచారి బ్రహ్మచారి, ఆంజనేయులుచారి, వేణుచారిలతో పాటు విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు, బ్రహ్మంగారి భక్తులు పాల్గొన్నారు.

## ఉప్పల్ జోనల్ కమిషనర్‌గా రాధిక గుప్తా బాధ్యతలు



ఉప్పల్ జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న రాధిక గుప్తా తదితరులు

**ఉప్పల్, డిసెంబరు 26 ప్రభాతవార్త :** ఉప్పల్ జోనల్ కమిషనర్‌గా రాధిక గుప్తా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జిహెచ్ఎంసి ప్రక్షాళనలో భాగంగా ఉప్పల్ సర్కిల్‌ను కొత్తగా ఏర్పాటు చేసిన విషయం విధితమే. అయితే ఉప్పల్, కాప్రా, నాచారం, బోడుప్పల్, ఘట్‌కేసర్, నాగారం ప్రాంతాలను కలిసి కొత్త జోనల్ కమిషనరేట్‌గా ఏర్పాటు చేశారు. రాత్రికి రాత్రే ఉప్పల్ జోనల్ కమిషనర్‌గా రాధిక గుప్తాను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. దీంతో శుక్రవారం ఉదయం ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధికగుప్తా బాధ్యతలు చేపట్టారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ జోనల్ పరిధిలోని ప్రజల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు డిప్యూటి కమిషనర్లు, ఇతర ఉద్యోగులు ఆమెను సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.